1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
సోమవారం | ఫిబ్రవరి 24, 2025 | www.navatelangana.com

రాష్ట్ర ప్రభుత్వానికి అనుమతులివ్వాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యల పరిష్కారం, పేస్కేల్ అమలుకు నిధుల విడుదల, క్రమబద్ధీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వానికి అనుమతులు ఇవ్వాలని, సమగ్ర శిక్ష రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్ కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని కోరారు. ఆదివారం జిల్లాకు వచ్చిన కేంద్ర మంత్రిని ఎమ్మెల్యే పాయల శంకర్‌తో కలిసి వినతిపత్రం అందజేశారు. పీఏబీలో నిధులు సమకూర్చాలని కోరారు. పేస్కేల్ అమలు కోసం, క్రమబద్ధీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపితే, తప్పకుండ అమలు బాధ్యత తాను తీసుకుంటానని కేంద్రమంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ప్రియాంక, కవిత, దేవదర్శన్, అర్చన, రాజేశ్వర్ పాల్గొన్నారు.

రేపు సీఎంకు కృతజ్ఞత సభ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఎస్సీ వర్గీకరణ అమలు చేసినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞత సభను ఈనెల 25న ఉట్నూర్‌లో ఏర్పాటు చేస్తున్నట్టు చర్మకారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బిక్కీ గంగన్న తెలిపారు. ఆదివారం పట్టణంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మంగళవారం ఉదయం 10:30కు ఉట్నూర్‌లోని తిరుమల ఫంక్షన్ హాల్లో ఈ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. సభకు ముఖ్య అతిథి రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ నాగరి ప్రీతం వస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలు, పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దర్శనాల నగేష్, జిల్లా సీనియర్ నాయకులు నక్క రాందాస్ పాల్గొన్నారు.

నలుగురు ఎంపీలున్నా.. నాలుగు పైసలు తేలే..!

- ఉత్తర తెలంగాణ ప్రాజెక్టుల్లో ఏ ఒక్కదానికీ నిధులు సాధించలే..
- ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే ఆ అసమర్థతను సమర్థించినట్టే!
- శ్రామిక వర్గంపై పెరిగిన బీజేపీ మతోన్మాద పాలకుల దాడులు
- ఈ ఎన్నికలు సహా వచ్చే స్థానిక సంస్థల్లోనూ ఆ పార్టీని నిలువరించాలి
- అందుకు పట్టభద్రుల ఎమ్మెల్సీలో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, బండారు రవికుమార్

నవతెలంగాణ-కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో ఉత్తర తెలంగాణాలోనే నలుగురు ఎంపీలు, 8 మంది ఎమ్మెల్యేలు ఉన్నా.. కనీసం ఈ ప్రాంతంలోని పెండింగ్ ప్రాజెక్టుల కోసంగానీ, కొత్త పరిశ్రమలకు అవకాశం ఉన్న చోటగానీ, ఇదివరకే హామీలిచ్చిన వాటికిగానీ నాలుగు పైసలు తేలేకపోయారు. గత ఐదేండ్లలోనూ ఆ ఎంపీలే ఉన్నా.. ఈ ప్రాంతానికి గుండు సున్నానే తెచ్చారు. ఎంత సేపు మతోన్మాద చర్యలతో ప్రజల మనోభావాలతో ఓట్లు గొల్లగొడుతూ ప్రజాభివృద్ధికి పాటుపడని ఈ పార్టీని రాబోయే ఏ ఎన్నికల్లో ఆదరించినా.. వారి అసమర్థతను సమర్థించినట్టే అవుతుంది. పైగా శ్రామికవర్గంపైనే దాడులు చేస్తూ వారి కష్టాన్ని దోచుకునేలానే పాలిస్తున్న వారిని నిలువరించాల్సిందే!' అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, బండారు రవికుమార్ అన్నారు. ఈ నెల 27న జరగబోయే ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించేందుకు కాంగ్రెస్ అభ్యర్థి వుట్కూరి నరేందర్‌రెడ్డిని గెలిపించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని పిలుపునిచ్చారు. అందుకుగాను ఈ స్థానం పరిధిలోని 13 జిల్లాల పార్టీ కార్యదర్శులతో కలిసి కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రెస్‌భవన్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మతోన్మాద బీజేపీని ఓడించగల శక్తి ఉన్న కాంగ్రెస్ అభ్యర్థినే గెలిపించాలని పిలుపునిచ్చారు. ఉత్తరతెలంగాణలోనే ఆదిలాబాద్‌లో సిమెంట్ పరిశ్రమ మొదలు సీసీఐకి కేంద్రం నుంచి ఇక్కడి బీజేపీ ఎంపీలు రూపాయి తేలేకపోయారని అన్నారు. నిజామాబాద్‌లో పసుపుబోర్డు పేరుతో ఐదేండ్లు ఎంపీగా చేసిన



కరీంనగర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న బండారు రవికుమార్

అరవింద్, ఇప్పుడు మళ్లీ గెలిచి బోర్డు తెచ్చినట్టు ప్రకటించారని అన్నారు. ప్రకటించిన పసుపు బోర్డుకు మొన్నటి కేంద్ర బడ్జెట్‌లో రూపాయి కేటాయించలేకపోయారని వివరించారు. ఆదిలాబాద్ టూ బీదర్ రైల్వేలైన్, ఉత్తర, దక్షిణ భారతదేశాలను కలిపే కాజీపేటలో అదనపు రైల్వేలైన్, ఈ ప్రాంతంలో పెద్దఎత్తున బీడీ పరిశ్రమపై ఆధారపడిన కార్మికుల సంక్షేమం ఇలా చెప్పుకుంటూ పోతే అనేక ప్రాజెక్టుల కోసం కొట్లాడకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇవేగాక కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ సైతం కనీసం ఒక్క సైనిక్ స్కూల్‌గానీ, నవోదయ పాఠశాలగానీ తేలేకపోయారన్నారు.

మెదక్ బీజేపీ ఎంపీగా ఉన్న రఘునందన్‌రావు సైతం ఆ ప్రాంత అభివృద్ధికి కనీసం ప్రయత్నం చేయడం లేదన్నారు. పక్కరాష్ట్రంలో మిర్చి రైతుల కోసం ఎన్‌డీఏ ప్రభుత్వంలోని అక్కడి సీఎం చంద్రబాబునాయుడు కేంద్రంతో మాట్లాడుతుంటే ఇక్కడి బీజేపీ ఎంపీలకు తెలంగాణ మిర్చి రైతులు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. కనీసం పక్క రాష్ట్రాన్ని చూసి అయినా సోయి లేదా?అంటూ ఘాటుగా విమర్శించారు. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఈ ప్రాంత ప్రజల ఓట్లతో గెలిచిన బీజేపీని ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా ఆదరిస్తే మాత్రం వారి అసమర్థతను సమర్థించినవాళ్లమే అవుతామని అన్నారు. దానికితోడు మతోన్మాద రాజకీయాలకు మరింత బీజం వేసినవాళ్ల అవుతామని చెప్పుకొచ్చారు. ఈ పార్టీని నిలువరించేందుకు ఈ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనే బుద్ధిచెప్పాలని, అందుకు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీలో ఉన్న వి.నరేందర్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ నిర్ణయాన్ని పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశంలోనే చేశామని, పార్టీ నిర్ణయం మేరకు తాము ప్రకటిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో కరీంనగర్, పెద్దపల్లి, రాజన్నసిరిసిల్ల,జగిత్యాల, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సిద్దిపేట, మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శులు పాల్గొన్నారు.



మండలి పోరు.. ప్రచార హోరు..!

- ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న ప్రధాన పార్టీలు
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వ్యూహాలు
- ఉమ్మడి జిల్లా పట్టభద్రుల ఓటర్లపై స్పెషల్ ఫోకస్
- నేడు మంచిర్యాలకు సీఎం రేవంత్‌రెడ్డి
- చివరి అంకానికి చేరుకున్న ప్రచారం

శాసనమండలి పోరు మరింత ఉధృతమవుతోంది. ప్రచార పర్వం చివరి అంకానికి చేరుకోవడంతో ప్రధాన పార్టీలు, అభ్యర్థులు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. పట్టభద్రులను ప్రసన్నం చేసుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ముఖ్యంగా ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. తాజా ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీకి దూరంగా ఉండటంతో మిగితా కాంగ్రెస్,బీజేపీ పార్టీలు ప్రధాన దృష్టి కేంద్రీకరించాయి. శని, ఆదివారాల్లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించగా.. సోమవారం మంచిర్యాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానుండటం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఆదివారం రాత్రి మంచిర్యాలలో పట్టభద్రులతో కేంద్రమంత్రి బండి సంజయ్ సైతం సమావేశం కానున్నారు. వీరితో పాటు ఇప్పటికే రాష్ట్ర స్థాయి కీలక నాయకులు, ఎమ్మెల్యేలు విస్తృతంగా పర్యటించి మండలి పోరును మరింత రసవత్తరంగా మార్చారు.



సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించి సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

శాసనమండలి ఎమ్మెల్సీ ఎన్నికలకు సమయం దగ్గరపడింది. గత మూడు నెలల నుంచి నిర్వహించిన ప్రచారం తుది అంకానికి చేరుకుంటోంది. ఈ నెల 27న పోలింగ్ జరగనుండగా.. ఈ నెల 25వ తేదీ సాయంత్రం 4గంటలకే ప్రచార పర్వం పరిసమాప్తం కానుంది. దీంతో రెండు రోజులే సమయం ఉండటంతో ప్రధాన పార్టీలతో పాటు పోటీలో ఉన్న అభ్యర్థులు నాలుగు జిల్లాల పరిధిలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. పట్టభద్రులను నేరుగా కలవడంతో పాటు సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ శాసనమండలి నియోజకవర్గానికి కాంగ్రెస్ నుంచి ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి వూట్కూరి, బీజేపీ నుంచి అంజిరెడ్డి, బీఎస్పీ నుంచి ప్రసన్న హరికృష్ణతో పాటు వివిధ పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులుగా పలువురు బరిలో దిగారు. ఈ నియోజకవర్గం పరిధిలో 56మంది అభ్యర్థులు పోటీ ఉండగా.. ప్రధాన పార్టీల మధ్య పోటీ నువ్వా- నేనా అన్నట్లుగా మారింది. మిగితా స్వతంత్ర అభ్యర్థులు సైతం విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాపై ప్రత్యేక ఫోకస్..!

ఉమ్మడి జిల్లాపై ప్రధాన పార్టీలు ప్రత్యేక ఫోకస్ పెట్టాయి. ఇది వరకు ఈ స్థానం నుంచి గెలుపొందిన కాంగ్రెస్ మరోసారి విజయం సాధించగాలని భావిస్తుండగా.. ఈ ప్రాంతంలో బలంగా ఉన్న బీజేపీ సైతం ఈ స్థానాన్ని కైవసం చేసుకోవాలని భావిస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా ఈ రెండు పార్టీలకు చెందిన కీలక నాయకులు ఉమ్మడి జిల్లాలో విస్తృతంగా పర్యటించి పట్టభద్రులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే రెండు రోజుల పాటు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించి పట్టభద్రులతో సమావేశం నిర్వహించారు. తాజాగా మంచిర్యాలకు సీఎం రేవంత్‌రెడ్డి రానుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇక్కడ ఏర్పాటుచేసే బహిరంగ సభలో పాల్గొననున్నారు. తొలుత నిర్మల్‌లో సభ ఉంటుందని ప్రచారం జరిగినా చివరకు మంచిర్యాల పర్యటన ఖరారైంది. ఉమ్మడి జిల్లాలో 67,738మంది ఓటర్లు ఉండగా మంచిర్యాల జిల్లాలోనే 30వేలకు పైగా ఓటర్లు ఉండటంతో ఈ ప్రాంతంలో సీఎం సభ నిర్వహించేందుకు మొగ్గుచూపినట్లు తెలుస్తోంది.

తరుచూ ఫోన్‌కాల్‌లు..!

శాసనమండలి నియోజకవర్గం నాలుగు జిల్లాల పరిధిలో ఉండటంతో అభ్యర్థులు ప్రత్యక్ష ప్రచారంతో పాటు ఫోన్ల ద్వారా అధికంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. పట్టభద్రులకు ఫోన్లు చేయిస్తూ మద్దతు తెలుపాలని అభ్యర్థిస్తున్నారు. ఇలా వివిధ పార్టీల అభ్యర్థులతో పాటు పలువురు స్వతంత్రులు సైతం ఇదే పద్ధతిని అనుసరిస్తున్నారు. ఒకరి తర్వాత ఒకరి ఫోన్లు రావడంతో పట్టభద్రులు సైతం అసహానికి గురవుతున్నట్లు తెలుస్తోంది. సంక్షిప్త సందేశాల రూపంలో పట్టభద్రుల ఓటరు సీరియల్ నెంబర్, పోలింగ్ కేంద్రం తదితర వివరాలతో పంపిస్తున్నారు. ప్రచారానికి మరో రెండురోజులు మాత్రమే ఉండటంతో ప్రధాన పార్టీలు ర్యాలీలు, మరిన్ని సభలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.


చికెన్ షాపుల్లో నిల్.. మటన్ షాపుల్లో ఫుల్..



నవతెలంగాణ-తాంసి

పౌల్ట్రీ, బైలర్ కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాధి లక్షణాల కారణంగా ప్రజలు చికెన్ తినడానికి భయపడటంతో చికెన్ సెంటర్లు గత రెండు రోజులుగా అమ్మకాలు నిలిపివేశారు. మార్చ్ 1వ తేదీ వరకు చికెన్ అమ్మకాలను నిలిపివేస్తున్నట్టు చికెన్ విక్రయదారులు స్వచ్ఛందంగా తమ దుకాణాలను మూసివేశారు. కొన్ని మారుమూల గ్రామాలలో అక్కడక్కడ చికెన్ అమ్మకాలు కొనసాగుతున్నప్పటికీ, ప్రజలు చికెన్ తినడానికి ఆసక్తి చూపడం లేదు. ఆదివారం అంటేనే మాంసాహారం తినడానికి ఆసక్తి చూపే మాంస ప్రియులు చికెన్ సెంటర్‌ల వైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో చికెన్ సెంటర్లు బోసిపోయాయి. ప్రజలు మేక మాంసం, చేపలు తినడానికి ఆసక్తి చూపుతున్నారు. మటన్ సెంటర్లు ఎక్కడ చూసినా కిక్కిరిసిపోతున్నాయి. ఇదే అదునుగా చూసి మటన్ విక్రయదారులు మేకలను, గొర్రెలను, వ్యాధి లక్షణాలు కలిగిన వాటిని సైతం కోసి అమ్మకాలు చేపడుతున్నారు. కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాధి పైనే అందరి దృష్టి ఉంది కానీ మేకలకు, గొర్రెలకు అనేక రకాల వ్యాధులు ఉంటాయనే మాటను ప్రజలు మరిచి పోతున్నారు.

వైన్‌షాప్ దొంగల ముఠా అరెస్టు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఇటీవల మండల కేంద్రంలో వైన్‌షాపులో చోరీకి పాల్పడిన నిందితులను ఎస్సై దుబ్బాక సునీల్ ఆదివారం పట్టుకుని అరెస్టు చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ఇటీవలే మండల కేంద్రంలోని ఈశ్వర్‌నగర్ వైన్‌షాపుతో పాటు ఉట్నూర్, గాదిగూడ, నార్నూర్, మావల, తలమడుగులో కిరాణ దుకాణాలు, పక్క జిల్లా కరీంనగర్, కొడిమియాల్ తదితర ప్రాంతాల్లో వరుస దొంగ తనాలకు పాల్పడిన ముఠాను పట్టుకున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని దుర్గానగర్‌లో నివాసముంటున్న సుక్‌దేవ్(25), ఆర్.గజనంద్(21), టి.కృష్ణ(20), బి.ఆకాశ్(19)లను అరెస్టు చేసి, వీరి వద్ద ఒక టూ వీలర్ బైక్‌తో పాటు రూ. 2వేల 200లు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు. నలుగురిపై కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జీవిని రక్షించాలనే ఉద్యేశంతో శాఖాహార ర్యాలీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రతి జీవి రక్షించబడాలనే లక్ష్యంతో ప్రజల్లో శాఖాహారంపై అవగాహన కల్పిస్తున్నామని ది పిరమిడ్ సేవాదళ్ తెలంగాణ అధ్యక్షుడు భూపతిరాజు అన్నారు. ఆదివారం తిరుమల, తిరుమతి దేవస్థాన కళ్యాణ మండపం నుంచి మహాకరుణ మెగా శాఖాహార ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగి తిరిగి కళ్యాణ మండపానికి చేరుకుంది. దారి పొడువున మాంసాహారం వల్ల కలిగే అనార్థలను తెలియజేస్తు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ది పిరమిడ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు మాట్లాడుతూ ప్రతి జంతువును కాపాడాలనే ఉద్యేశంతో ది పిరమిడ్ స్పిర్చ్యువల్ సొసైటిస్ మూమెంట్ వ్యవస్థాపకులు బ్రహ్మర్షి పితామహ పత్రీజీ శాఖాహారంపై ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నారన్నారు. ప్రతి నెల మూడో ఆదివారం జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించి చైతన్యం కల్పిండానికి కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. మాంసాహారం వల్ల కలిగే నష్టాలను తెలియజేయడమే తమ ఉద్యేశమన్నారు. ది పిరమిడ్ స్పిర్చ్యువల్ ట్రస్ట్ అధ్యక్షుడు సంతోష్ మాట్లాడుతూ మాంసా హారం తినడం వల్ల అనేక వ్యాధులకు గురవుతున్నారన్నారు. అదే శాఖాహారం వల్ల వ్యాధులను నియంత్రివచ్చునని తెలిపారు. ప్రజలు మాంసా హారాన్ని మాని శాఖాహారంవైపు మళ్లాలని కోరారు. కార్యక్రమంలో పీఎస్ఎస్ఎం హైదరాబాద్ సభ్యులు దామోదర్, శేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, గౌరవాధ్యక్షుడు నరేందర్, సీనియర్ మాస్టార్లు సునీత వెంకట్, పెంటాజీ, కందుల జితేందర్, నవనీత్ పాల్గొన్నారు.



ది పిరమిడ్ సేవాదళ్ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన శాఖాహార ర్యాలీ

కలిసి కట్టుగా సంఘ బలోపేతానికి కృషి



ప్రమాణ స్వీకారం చేస్తున్న యాదవ సంఘం జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

యాదవులు కలిసి కట్టుగా సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని యాదవ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు అరిగెల నాగేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని బాశెట్టి మాదవరావు విజ్ఞాన కేంద్రంలో అఖిల భారత యాదవ మహాసభ జిల్లా కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకార మహోత్సవం నిర్వహించారు. దీనికి ఆయనతో పాటు రాజారామ్ యాదవ్, డా.రవికిరణ్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై నూతన కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను సత్కరించి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా అరిగెల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ 40 ఏండ్ల క్రితం యాదవ సంఘాన్ని ఏర్పాటు చేశామన్నారు. తాను విద్యార్థిగా ఉన్న సమయంలో హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశానికి ఆదిలాబాద్ నుంచి ప్రాతినిధ్యం లేదని గ్రహించామన్నారు. ఫోన్లు లేని సమయంలో ఉత్తరాల ద్వారా అందరిని సమీకరించి సంఘాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం నూతన కార్యవర్గంలో అధ్యక్షులుగా ఎన్నికైన హన్మండ్లు మంచి సేవలు అందించాలని ఆకాంక్షించారు. సమస్యలపై స్పందించడంతో పాటు సంఘాన్ని బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాఘవేంద్ర, విజయ్‌బాబు, గొర్ల రాజు, నారాయణ, ఆశన్న, భీమన్న, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులకు శిక్షణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆర్టీసీని లాభాలవైపు తీసుకెళ్లడంతో పాటు ప్రయాణీకులకు నాణ్యమైన సేవలను అందించడంపై సంస్థ దృష్టి సారించిందని ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన తెలిపారు. ఇందులో భాగంగానే ఆర్టీసీ కార్మికులకు నైపుణ్య శిక్షణ అందజేస్తున్నామని తెలిపారు. ఆదివారం ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన ఈ శిక్షణ కార్యక్రమంలో కార్మికులకు ప్రమాద రహిత డ్రైవింగ్, ప్రయాణీకులతో వ్యవహరించే తీరును వివరించారు. కార్యక్రమంలో ఎంఎఫ్ జై.శ్రీకర్ పాల్గొన్నారు.



మహనీయులు చూపిన మార్గంలో నడవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహనీయులు చూపిన మార్గంలో పయనిస్తూ మెరుగైన సమాజ నిర్మాణానికి పాటు పడాలని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. పట్టణంలోని చిలుకూరి లక్ష్మినగర్‌లో ఆదివారం సంత్ రవిదాస్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించగా, ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉత్సవ కమిటి ప్రతినిధులతో కలిసి సంత్ రవిదాస్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఆధ్యాత్మికత వైపు ప్రజలను చైతన్యవంతులను చేయడంలో సంత్ రవిదాస్ కృషి చేశారన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుంటూ ముందుకు సాగాలన్నారు. తాను గెలిచినా ఓడినా ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటానని, తుది శ్వాస వరకు ప్రజాసేవే లక్ష్యంగా పని చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రఘునాథ్ ఇటుకరే, సంజయ్ గైక్వాడ్, సంతోష్ ఇంకరే, సంతోష్ గైక్వాడ్, దాదారావు, డాక్టర్ అల్కా సంజయ్, చంద్ర ప్రకాష్, మధు భవల్కర్, అశోక్ కాలే, డాక్టర్ రాజు, హేమంత్ పాల్గొన్నారు.

కళాకారులు, కవులను ప్రోత్సహించడం అభినందనీయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో కళాకారులు, కవులను ప్రోత్సహించడం అభినందనీయమని కలం స్నేహం వ్యవస్థాపకులు శ్రీమన్ గోపాల్ అచార్య అన్నారు. ఆదివారం వాసవి కన్యక పరమేశ్వరి ఆలయంలో కలం స్నేహం జిల్లా ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు అరుణ బట్టువార్ రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలం స్నేహం వ్యవస్థాపకులు శ్రీమన్ గోపాల్ ఆచార్య మాట్లాడుతూ జిల్లాలో ప్రకృతి అందాలు ఎన్నో ఉన్నాయన్నారు. ఇక్కడ ప్రజలు కళాకారులను ప్రోత్సహించడం సంతోషకరమైన విషయమన్నారు. సంస్కృతిని కాపాడటంలో రచయితలు చేస్తున్న కృషిని అందరికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య పట్టణాక్షుడు కొత్తవార్ రాజేశ్వర్, హరిరమణ, దేవిప్రియ, రచయిత ఆశన్న, హరిమణ, రాధిక, మాసం సీమ, జ్యోతి వైద్య, సుజాత వైద్య, అరుణ ప్రసాద్, మీన, సబిత, బాబిత, వసంత పాల్గొన్నారు.

నిర్మల్‌లో జరిగే సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన రద్దు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్మల్ జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన రద్దయింది. సోమవారం నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, మంచిర్యాల జిల్లాలో పట్టభద్రులతో సీఎం సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో అనివార్య కారణాల వలన నిర్మల్ పర్యటన రద్దయినట్టు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
ఆదిలాబాద్-నిర్మల్
సోమవారం | ఫిబ్రవరి 24, 2025 | www.navatelangana.com

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-పెంబి

మండలంలోని నాగపూర్ గ్రామానికి చెందిన మైసయ్య ఇటీవల విద్యుద్ఘాతంతో మరణించగా, విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూక్యా జాన్సన్ నాయక్



ఆదివారం నాగపూర్‌లోని వారి నివాసానికి వెళ్లి మైసయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి, మనోధైర్యం కల్పించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి తనవంతు ఆర్థిక సాయం చేశారు. వారి వెంట బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు నరేందర్‌రెడ్డి, గంగారెడ్డి, శంకర్, రాజేందర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ పట్టణంలోని బ్రహ్మపురి స్కూల్లో 1981 సంవత్సరంలో 7వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం పెన్షనర్ భవనంలో నిర్వహించారు. ఈ సమ్మేళనంలో చదువు చెప్పిన ఉపాధ్యాయులు మల్లన్న దంపతులను సన్మానించారు. అలాగే ఎక్కడెక్కడో స్థిరపడినవారు అంత ఒక చోట చేరి, చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం సామూహిక భోజనాలు చేశారు. కార్యక్రమంలో పద్మ, రాజేశ్వర్, అర్చన, అరుణ, సుజాత, నారాయణ పాల్గొన్నారు.



ఘనంగా హీరాసుక జయంతి వేడుకలు

- పర్దాన్ కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి
- జిల్లా కలెక్టర్ రాజర్షిషా


హీరాసుక జయంతి వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ రాజర్షిషా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదివాసీ పర్దాన్ సమాజ్ కులదైవం, గోండి ధర్మగురు హీరాసుక జయంతి వేడుకలను ఆదివారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. హీరాసుక జయంతి వేడుకల్లో భాగంగా ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గల హీరాసుక ఆలయంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేయడంతో పాటు ఆదివాసీ జెండాను ఆవిష్కరించి, ఉద్యమ నాయకులు కుమురంభీం, కుమురం సూరుల విగ్రహాలకు పూలమాలలు వేశారు. అంతకుముందు ఆదివాసీ పర్దాన్ కులస్తులు కలెక్టర్‌కు ఢోలు వాయిద్యాలతో సాంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదివాసీ పర్దాన్ కులస్తుల సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని అన్నారు. ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలు ఎంతో గొప్పవని, వాటిని భావితరాలకు అందించేలా నాయకులు, సంఘ పెద్దలు కృషి చేయాలన్నారు. ప్రకృతితో కలిసి ఉండే ఆదివాసులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయన్నారు. యంత్రాంగం కూడా వారికి ఫలాలను అందించేలా కృషి చేస్తుందని తెలిపారు. ఇటీవల నాగోబా జాతరను విజయవంతంగా నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో ఏర్పాటు చేసిన సభలో పలువురు నాయకులు మాట్లాడుతూ ఐక్యమత్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ పర్దాన్ సమాజ్‌లోని ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉంటూ ముందుకు సాగాలని అన్నారు. ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాల ప్రాశస్త్యాన్ని భావితరాలకు తెలియజేసేలా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఐక్యంగా ఉంటూ సంఘం పటిష్టతకు పాటు పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, రిటైర్డ్ ఎస్పీ బాపురావు, రిటైర్డ్ తహసీల్దార్ కోవ మనోహర్, సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్‌రెడ్డి, బోరంచు శ్రీకాంత్ రెడ్డి, ఉత్సవ కమిటి అధ్యక్షుడు మెస్రం శంకర్, సిడాం రాంకిషన్, పీవీటీజీ ఏపీఓ మనోహర్, కుడ్మెత సుభాష్, మడావి దిగంబర్, గెడం మాధవ్, కుడ్మెత ప్రకాష్, వెట్టి మనోజ్, వెట్టి దేవిదాస్, సిడాం రవి, మహిళ నాయకురాళ్లు ఆత్రం అనసూయ, గెడం భారతిబాయి, గిరిజబాయి, వనిత పాల్గొన్నారు.

పర్దాన్‌ల సంక్షేమానికి తన వంతు కృషి..

పర్దాన్ సమాజ్ కులస్తుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని, ప్రభుత్వం తరపున సంక్షేమ ఫలాలు అందేలా చూస్తానని కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం నిర్వహించిన హీరాసుక జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే విధంగా తనవంతుగా కృషి చేస్తానని, సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాస్తానని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ షేక్ ఇమ్రాన్, ఎంఏ షకీల్, మొహమ్మద్ రఫీక్, దొగ్గలి రాజేశ్వర్, తమ్మల చందు, మానే శంకర్, డేరా కృష్ణరెడ్డి, ఎల్మ రామ్‌రెడ్డి, తోఫిక్, గడ్డం అఖిల్‌రెడ్డి, ఎల్టీ ప్రదీప్‌రెడ్డి, అంజాద్‌ఖాన్ పాల్గొన్నారు.


హీరాసుక జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న కంది శ్రీనివాస్‌రెడ్డి

పరీక్ష కేంద్రం తనిఖీ



నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని సోఫీనగర్ ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలలో గురుకుల ప్రవేశ పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పలు గదులను తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించి, అందుబాటులో ఉన్న మందుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి ఆటంకాలు లేకుండా, గురుకుల ప్రవేశ పరీక్షను ప్రశాంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు కల్పించిన మంచి నీటి, తదితర వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డానియల్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బుడోకాన్ ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో బోధి బుడోకాన్ కరాటే అసోసియేషన్ సీనియర్ మాస్టర్ కాంబ్లె ముకేశ్ కూమర్ ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో 116 మందికి బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కరీంనగర్ నుంచి డా. దీపక్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కరాటే శరీర దారుఢ్యానికి మానసికోల్లాసానికి దోహద పడుతుందన్నారు. ప్రతిఒక్కరూ కరాటే నేర్చుకోవాలని సూచించారు. ఇందులో ఎల్లో 35, ఆరెంజ్ 15, గ్రీన్ 12, బ్ల్యూ 11, పర్పుల్ 9 మంది బెల్ట్‌లు సర్టిఫికెట్‌లు అందుకున్నన్నారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు. కార్యక్రమంలో మాస్టర్లు ఆకాష్, సంధ్య, రాహుల్, సునీత, అంగీరస్ బౌద్, అనుష్క, అభిజీత్, బుద్ధగయా పాల్గొన్నారు.

వ్యాయమశాల నిర్మాణానికి భూమిపూజ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని టీచర్స్ కాలనీలో నూతనంగా హనుమాన్ ఆలయ వ్యాయమశాల నిర్మిస్తున్నారు. ఆదివారం పట్టణానికి చెందిన సామజిక కార్యకర్త ముడుపు మౌనిష్‌రెడ్డి పాల్గొని భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనను ఆలయ కమిటీ అధ్యక్షులు విక్రమ్, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, కోశాధికారి గంగయ్య సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి దాలే రవి, రాజయ్య, శంకర్, తిరుపతి, రాజేందర్ భోయర్, అశోక్, నర్సింగరావు, గేడం తిలక్, బొజ్జారెడ్డి, నగేష్‌రెడ్డి, గులాబ్‌రావు, సంతోష్, మాజీ కౌన్సిలర్ కృష్ణ యాదవ్, శంకర్ పాల్గొన్నారు.

ఓయూ పూర్వ విద్యార్థి హరికృష్ణనే గెలిపించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓయూ పూర్వ విద్యార్థి, తెలంగాణ ఉద్యమకారుడు, వందలాది కాంపిటెటివ్ ఎగ్జామ్స్ పుస్తకాలు రచించి, వేలాది మంది నిరుద్యోగులను పట్టభద్రులను ఉద్యోగులుగా తీర్చిదిద్దిన మేధావి అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఓయూ జేఏసీ కన్వీనర్ కోడూరు రఘు తెలిపారు. ఆదివారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. తన 19 సంవత్సరాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగ సర్వీస్‌ను వదులుకొని పట్టభద్రుల ఉద్యోగుల నిరుద్యోగుల గొంతుకగా నిలబడిన బహుజన బిడ్డ ప్రసన్న హరికృష్ణను భారీ మెజారిటీతో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. రెండు జాతీయ పార్టీలు ఒకే అగ్రవర్ణ ఆధిపత్య కులానికి టికెట్లు కేటాయించి, 90శాతం జనాభా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలను విస్మరించాయన్నారు. రెండు జాతీయ పార్టీలు మద్దతిచ్చిన అభ్యర్థులు కార్పొరేట్ వ్యాపారాలతో ప్రయివేట్ విద్యాసంస్థలతో పేద వర్గాలను ముక్కు పిండి ఫీజులు వసూలు చేసి, వేల కోట్లు సంపాదించి, రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, ఉన్నతంగా బలంగా ఉన్నారన్నారు. కానీ ప్రసన్న హరికృష్ణ, ఒక పేదింటి బహుజన బిడ్డ కేవలం చదువుకున్న జ్ఞానంతో వందలాది పుస్తకాలు రాసి వేలాది మంది నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించేలా చేసిన ఆయన మనలో ఒకడన్నారు. ఇప్పుడు జరుగుతున్న పట్టభద్రుల ఎన్నికలు అగ్రవర్ణాలకు బహుజనులకు మధ్య పోటీ కచ్చితంగా బహుజన మేధావులు పట్టభద్రులు నిరుద్యోగులు ఆయనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఓయూ జేఏసీ నాయకులు బొమ్మకంటి సత్యపాల్, వంశీకృష్ణ, శ్రావణ్, సాయిచరణ్, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు రత్నపురం రమేష్, అసెంబ్లీ అధ్యక్షులు శ్రీహరి, జిల్లా నాయకులు లక్ష్మణ్, లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

నాసిరకంగా సీసీ రోడ్ల నిర్మాణం

- నామమాత్రంగా క్యూరింగ్
- పగుళ్లు తేలుతున్న రోడ్లు
- ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షణ కరువు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో అంతర్గత రోడ్ల నిర్మాణాలు చేపడుతోంది. అందులో భాగంగా మండలంలోని 29 గ్రామపంచాయతీలకు గాను రూ.2.90 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ పనులను మార్చిలోపు పూర్తి చేయాల్సి ఉంది. ఐతే ఒక్కో గ్రామ పంచాయతీకు రూ.10 నుంచి రూ.15లక్షలతో సీసీ రోడ్లను నిర్మిస్తున్నారు. అయితే ఈ పనులను కొందరు అధికార పార్టీ నాయకులు పర్సెంటేజీలకు ఆశపడి బినామీ గుత్తేదారులకు అంట బెడుతున్నారు. దీంతో ఆ గుత్తేదారులు నాసిరకంగా పనులు చేస్తున్నారని, ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. సిమెంట్ రోడ్డుకు సరియైన పాళ్లలో సిమెంటు, ఇసుక కలుపక పోవడం, సీసీని మీద ప్రెస్సింగ్ చేయక పోవడంతో అది మున్నాళ్ల ముచ్చటగానే అగుపిస్తున్నాయి. హర్కాపూర్ గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డు 3.6 మీటర్ల పొడవు ఉండాల్సిన రోడ్డుకు తక్కువ వెడల్పులో నిర్మించి చేతులు దులుపుకున్నారు. కొన్ని సీసీ రోడ్ల నిర్మాణంలో కింద పాలతీన్ కవరు సైతం అమర్చక చకచక పనులను చేపడుతున్నారు. దీంతో ఏదేని సిమెంట్ పనులు చేసినప్పుడు కనీసం 21 రోజుల పాటు క్యూరింగ్ చేయాల్సిన గుత్తేదారులు మూడు, నాలుగు రోజులు క్యూరింగ్ చేసి తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో కలకాలం నాణ్యత ఉండాల్సిన సీసీ రోడ్లు ఏడాది లోపే శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

అధికారుల పర్యవేక్షణ కరువు..

ఆయా గ్రామాల్లో జరుగుతున్న సీసీ రోడ్ల పనులు చేపట్టినప్పుడు ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో జరుగాలి. ఆ శాఖ అధికారులు పనులు జరిగినప్పుడు కొలతలు తీసుకునేటప్పుడు మాత్రమే వెళ్తున్నట్లు తెలుస్తోంది. నాణ్యతపై ఏటువంటి దృష్టి సారించడంలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కాంట్రాక్టర్‌కు అండదండలు...

సంభందిత శాఖ ఇంజనీర్లు ఎంబి రికార్డు చేసినప్పుడు క్వాలిటీ కంట్రోల్ అధికారులు, పనులు జరిగిన చోట క్యూసీ రిపోర్టు ఇవ్వాలి. వారు సైతం గుత్తేదారులకు వత్తాసు పలుకడంతో నాణ్యతను గాలికి వదిలేస్తున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ఈ సీసీ రోడ్ల నిర్మాణంపై దృష్టి సారించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. పై విషయంపై సంబంధిత శాఖ ఈఈని ఫోన్‌లో వివరణ కోరగా ఆయన స్పందించలేదు.


పగుళ్లు తెలిన సీసీ రోడ్డు

ఎమ్మెల్సీలను భారీ మెజార్టీతో గెలిపించాలి

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

నవతెలంగాణ-తలమడుగు

పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని ఉండంలో అయుషా గార్డెన్‌లో పట్టభద్రుల, ఉపాధ్యాయుల ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హజరై మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల కంటే ముందుగానే మన పార్టీ తరపున ఎమ్మెల్సీ అభ్యర్థుల పేర్లు ప్రకటించడం జరిగిందన్నారు. ఎంపీ స్థానం ఆదిలాబాద్ ఎమ్మెల్యే స్థానం గెలిచామన్నారు. దానికి అనుగుణంగా ఎమ్మెల్సీల గెలుపునకు కృషి చేయాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 14నెలలు గడుస్తున్న, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడం లేదన్నారు. ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎమ్మెల్సీ స్థానాలు గెలుస్తున్నట్టు సర్వేలు చెబుతున్నాయని అన్నారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులు, పట్టభద్రులు ఎమ్మెల్సీ గెలిచింతవరకు దీక్షతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బ్రహ్మానందం ఖరాడే, అసెంబ్లీ ఇన్‌చార్జీ విజయ్ కుమార్, ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్, అరిగెల నగేష్, బీజేపీ నాయకురాలు సుహాసినిరెడ్డి, హరీష్‌బాబు, ఏమాజీ, నగేష్ మండల నాయకులు కనపర్తి చంద్రకాంత్, స్వామి, దత్తు, ఆసిఫాబాద్, మంచిర్యాల, కాగజ్‌నగర్, బెల్లంపల్లి, నిర్మల్ బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో బిల్లు పాస్ చేసి ఎస్టీ హోదా కల్పించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మాలీ కులస్తుల ఎస్టీ హోదా బిల్లు తెలంగాణ అసెంబ్లీలో పాసై ఆమోదం కోసం కేంద్రానికి పంపడం జరిగిందని, అది కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉందని త్వరలోనే పార్లమెంట్లో బిల్లు పాస్ చేసి మాలీలకు ఎస్టీ హోదా కల్పించేలా చర్యలు చేపట్టాలని, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పేట్కులే కోరారు. ఆదివారం జిల్లాకు వచ్చిన కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. కేంద్రమంత్రికి మాలీల ఎస్టీ హోదా విషయం ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ వివరించగా మంత్రి సానుకులంగా స్పందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాలీ మహా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్ గుర్నూలె, రాష్ట్ర ప్రచార కార్యదర్శి మురళీధర్ నాగోశే పాల్గొన్నారు.

ఏజెన్సీ విధానాన్ని రద్దు చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఏజెన్సీ విధానం రద్దు చేయాలని, కార్పొరేషన్ ద్వారానే పేస్కేల్ ఇప్పించే విధంగా చూడాలని అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జేఏసీ నాయకులు కోరారు. ఆదివారం జిల్లాకు వచ్చిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రతినెల 5వ తేదీలోగా వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ప్రతి సంవత్సరం ఉద్యోగికి వేయి రూపాయలు ఇంక్రిమెంట్ కల్పించాలన్నారు మహిళలకు ప్రసూతి సమయంలో వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలన్నారు. గవర్నమెంట్ విడుదల చేసే ప్రతి నోటిఫికేషన్‌లో అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న వారికి వెయిటేజ్ మార్కులు ఇవ్వాలని అన్నారు. ఉద్యోగి సర్వీస్‌లో మరణిస్తే వారి కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం ఇవ్వాలని కోరారు.

ఈ కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ జేఏసీ రాష్ట్ర నాయకులు బండ శ్రీనివాస్, పుల్లూరి రవి, తోట రాజు, రామగిరి సంతోష్, కాదాసు జ్ఞానేందర్, శైలేందర్ గౌడ్, రవికిరణ్ యాదవ్, ఫెరోస్, రాజు, నాయకులు పాల్గొన్నారు.

యూజీసీ నెట్‌లో అర్హత సాధించిన విద్యార్థిని

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



యూజీసీ నెట్ జెఆర్ఎఫ్ చరిత్ర సబ్జెక్టులో జిల్లాకు చెందిన విద్యార్థిని అర్హత సాధించింది. పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కామర్స్ డిగ్రీ కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థిని ముండే రుమాతాయి ప్రస్తుతం సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో పీజీ సెకండ్ ఇయర్ చదువుతుంది. పీజీ చదువుతూనే యూజీసీ నెట్ జెఆర్ఎఫ్ చరిత్ర సబ్జెక్టులో అర్హత సాధించింది. ఈ నేపథ్యంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ రఘు గణపతి, చరిత్ర అధ్యాపక విభాగం యాకుబ్ అలీ, పృథ్వీరాజ్, సోనీ, కళాశాల సిబ్బంది అభినందించారు.

ప్రశాంతంగా టీజీసెట్ ప్రవేశ పరీక్ష

నవతెలంగాణ-కడెం

మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఆదివారం నిర్వహించిన 5, 6, 7, 8, 9 తరగతుల టీజీసెట్ ప్రవేశ పరీక్షలకు మొత్తం 743 విద్యార్థులకు గాను 718 హాజరయ్యారు. 25 మంది గైర్హాజరైనట్టు పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ శకుంతల తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని కడెం ఎస్సై కృష్ణ సాగర్‌రెడ్డి పర్యవేక్షించారు. టీజీసెట్ పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్టు ప్రిన్సిపల్ వెల్లడించారు.

ఘనంగా భీమన్న దేవుని ఉత్సవాలు

నవతెలంగాణ-కడెం

మండలంలోని ధర్మాజీపేట్ గ్రామంలో భీమన్న దేవుని జాతర ఉత్సవాలు ఆదివారం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భీమన్న దేవుని బండారు, భాసంతం, కళ్యాణం, జాతర, తదితర పలు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమాలలో వివిధ పార్టీల మండల నాయకుల, కడెం, ఖానాపూర్ మండలాలకు చెందిన భక్తులు భారీగా తరలివచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నవతెలంగాణ
కుమురంభీం ఆసిఫాబాద్
సోమవారం | ఫిబ్రవరి 24, 2025 | www.navatelangana.com

రాష్ట్ర ఛాంపియన్‌షిప్‌లో జిల్లా విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మంచిర్యాల జిల్లా మందమర్రిలో జరిగిన 8వ తెలంగాణ రాష్ట్ర ఓపెన్ కరాటే మరి కుంపు ఛాంపియన్‌షిప్-2025లో జిల్లాలోని సన్నీ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీకి చెందిన 15 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా మాస్టర్స్ కుకుడే సంతోష్, ఓరుగంటి శ్రావణ్ మాట్లాడుతూ విద్యార్థులు రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరచడం సంతోషంగా ఉందన్నారు. జాతీయ స్థాయిలో కూడా విద్యార్థులను సిద్ధం చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వినియోగించుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ నియోజకవర్గాల ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా ఈ నెల 27న జిల్లాలో జరుగనున్న పోలింగ్‌లో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రయివేట్ సంస్థలు, వ్యాపారం, పరిశ్రమలు, ట్రేడ్ ఇతర సంస్థలలో పని చేస్తున్న అర్హత గల ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 27న ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రభుత్వ ఉద్యోగులకు పోలింగ్ రోజు సెలవు దినంగా ప్రకటించడం జరిగిందని, ప్రయివేట్ సంస్థలలో పని చేసే ఉద్యోగులు, అధికారులకు ఓటు హక్కు వినియోగించుకునేలా వీలుగా విధులలో వెసలుబాటు కల్పించడం జరుగుతుందని, సెలవు దినం ఇవ్వడం జరుగుతుందని, ఆయా సంస్థల యాజమాన్యాలు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం సహకరించాలని తెలిపారు.

ఘనంగా గాడ్గే బాబా 149వ జయంతి వేడుకలు



నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధవిహార్‌లో అంబేద్కర్ సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం గాడ్గే బాబా 149వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి వందనం చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్ మాట్లాడుతూ స్వచ్ఛత ప్రవక్త, అంటరాని తనం నిర్మూలనకు, మూఢనమ్మకాలను పారద్రోలేందుకు కృషి చేసిన సంత్ గాడ్గే బాబా కర్మయోగి అన్నారు. బాబా తన జీవితాంతం సమాజహితం కోసం పాటుపడ్డారని, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సినిమా నుండి సమాజంలో సంపూర్ణ గౌరవం అభించే విధంగా అనేక పాఠశాలలు ఏర్పాటు చేసి వాటికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పాఠశాలలుగా నామకరణం చేశారన్నారు. గాడ్గే బాబా సంఘ సంస్కరణ కార్యక్రమాలను చూసి అంబేద్కర్‌ను సైతం తన సమావేశాలకు ఆహ్వానించేవారని, జంతు బలి ఇచ్చే ఆచారాన్ని సమాజం నుండి తరిమేసేందుకు కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు విజయ్, సందీప్, ప్రతాప్, రోషన్, చింటూ, రమేష్, ప్రకాష్, ఇంద్రజిత్, భీంరావు, నాగ్‌సేన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా అంజిరెడ్డిని గెలిపించాలి



నవతెలంగాణ-తిర్యాణి

మండల ఎన్నికల కన్వీనర్ పులి వెంకటేష్ ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల శాసనమండలి ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి అంజిరెడ్డిని, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా మల్క కొమురయ్యను గెలిపించాలని కోరారు. అనంతరం మండలంలోని రొంపెల్లి, మాణిక్యపూర్ గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఆత్రం గోపాల్, సీనియర్ నాయకులు కనక హన్మంత్‌రావు, బూత్ అధ్యక్షుడు మంగ రాజేష్ పాల్గొన్నారు.

సమాజ్‌రత్న అవార్డు అందుకున్న బీఎస్‌ఐ జిల్లా అధ్యక్షుడు



నవతెలంగాణ-వాంకిడి

సమాజ్‌రత్న అవార్డును భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్, ఎస్ఎస్‌డీ జిల్లా ఇన్‌చార్జీ దుర్గం సదీప్ ఆదివారం అఖిల భారతీయ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు వంజారే ప్రశాంత్, యవత్మాడ్ మహారాష్ట్ర మాజీ మంత్రి జోగు రామన్న, సంత్ రవిదాస్ సేవ మండల అధ్యక్షుడు చంద్రప్రకాష్ చేతులమీదుగా అందుకున్నారు. ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో ఆదివారం నిర్వహించిన సంత్‌గురు రవిదాస్ జయంతి వేడుకల సందర్భంగా అఖిల భారతీయ అంబేద్కర్ సాహిత్య, సాంస్కృతి సంవార్దన్ మహమండల్, మౌలిక అధికారి సమాజ్ సేవ మండల ఆదిలాబాద్ తెలంగాణ ఇచ్చిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సమాజ్‌రత్న 2024-2025 రాష్ట్ర అవార్డులను అందించారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

మహాశివరాత్రి జాతరలో వీఐపీ పాసుల రద్దు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

మహాశివరాత్రి సందర్భంగా కాగజ్‌నగర్ మండలంలోని ఈజ్‌గాం శ్రీ శివ మల్లన్న స్వామి జాతరలో వీఐపీ పాసులను రద్దు చేసినట్లు దేవాలయ కార్యనిర్వహణాధికారి గర్రెపల్లి వేణుగోపాల్ గుప్తా తెలిపారు. ఈ నెల 27న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనుండడంతో ఉమ్మడి జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు మహాశివరాత్రి జాతరకు వీఐపీ పాసులను రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రేపు జిల్లా కేంద్రంలో జాబ్ మేళా

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే దిశగా రేపు జిల్లా కేంద్రంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్టు బీఆర్ఎస్ యువ నాయకుడు కోవ సాయినాథ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్‌కేఎస్ఎస్ ఫ్యాక్స్ కాన్ (ఆపిల్ సంస్థ) సౌజన్యంతో స్థానిక ప్రేమల గార్డెన్‌లో జిల్లాలోని 1000 మందికి ఉపాధి కల్పించే దిశగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని, ఉదయం 10 గంటలకు ప్రేమల గార్డెన్‌లో ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అలుపెరగని పోరాటంతోనే జీఓ అమలు

- ఎస్‌సీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్
- నర్సరీ కార్మికులకు అభినందన సభ



అభినందన సభలో మాట్లాడుతున్న ఎస్‌సీకేఎస్ రాష్ట్ర దూలం శ్రీనివాస్

నవతెలంగాణ-రెబ్బెన

అలుపెరగని పోరాటంతోనే సింగరేణి నర్సరీ కాంట్రాక్ట్ కార్మికులు కనీస వేతన జీఓను సాధించుకున్నారని సీఐటీయూ అనుబంధ సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం(ఎస్‌సీకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ అన్నారు. బెల్లంపల్లి డివిజన్ పరిధిలోని గోలేటి ఏరియాలోని సీఐటీయూ కార్యాలయంలో సంఘం ఆధ్వర్యంలో గోలేటి నర్సరీ కార్మికుల అభినందన సభను బెల్లంపల్లి ఏరియా ఇన్‌చార్జి వెలిశాల క్రిష్ణమాచారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ నర్సరీ కార్మికుల నిరంతర అలుపెరగని పోరాటాలకు సింగరేణి యాజమాన్యం స్పందించిందన్నారు. కనీస వేతనాల జీఓ అమలు చేయడం గొప్ప పరిణామమని తెలిపారు. కార్మికులు తమ హక్కుల కోసం నిరంతరం పోరాటాలే తప్ప మరో మార్గం లేదన్న విషయాన్ని తెలుసుకున్నారన్నారు. నిత్యం కార్మికుల సమస్యలు, హక్కుల కోసం కార్మికవర్గం ఐక్యంగా ఉద్యమిస్తేనే ఫలితాలు ఘనంగా అందుతాయని, దానికి నిదర్శనం కనీస వేతన జీఓ అమలని తెలిపారు. పోరాటంలో నిరుత్సాహనికి చోటు ఉండదని, నిత్య విద్యార్థిలా కార్మికవర్గం ఎప్పుడు పోరాటాలనే ఆయుధంగా చేసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కార్మిక వర్గం హక్కులను హరించడానికి, కార్పొరేటర్లకు బానిసలుగా మార్చడానికి చాలా పెద్ద ఎత్తున కుట్రలు చేస్తు వేగంగా ముందుకు వస్తున్నాయని అన్నారు. కార్మిక వర్గం ఇప్పుడు పొందుతున్న హక్కులను కాపాడుకోవాలన్న, కొత్తగా హక్కులను పొందలన్న ఐక్య పోరాటాలకు నర్సరీ కార్మికుల పోరాట స్ఫూర్తితో ముందుకు రావాలని కోరారు. అనంతరం నర్సరీ కార్మికులను శాలువతో సన్మానించి స్వీట్లు పంపిణీ చేశారు. కార్మికులకు అండగా సంఘం ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో గోలేటి బ్రాంచి అధ్యక్ష, కార్యదర్శులు శారధ, రాజశేఖర్, చిన్నుబాయి, స్రవంతి, లక్ష్మి, కోట ప్రభాకర్, కేశవ్, రాజు, వేణు, మోహన్, నర్సరీ కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

టీజీ సెట్ ప్రవేశ పరీక్షకు 98 శాతం హాజరు

- కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్
- సెంటర్లు దొరకక విద్యార్థుల ఇబ్బందులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ గురుకులాలో 5వ తరగతి నుండి తొమ్మిదవ తరగతి వరకు ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. సిర్పూర్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల ప్రిన్సిపాల్, జిల్లా కోఆర్డినేటర్ డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో మొత్తంగా 10 కేంద్రాలు కేటాయించడం జరిగిందని, మొత్తం 3893 మంది దరఖాస్తు చేసుకోగా వీరిలో 2106 బాలురు, 1787 బాలికలు ఉన్నారు. అందులో 3828 విద్యార్థులు హాజరు కాగా వీరిలో 2071 మంది బాలురు, 1757 మంది బాలికలు హాజరైనట్లు, 65 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని, హాజరు శాతం 98.33గా ఉందని తెలిపారు.

పలు సెంటర్లు పరిశీలించిన కలెక్టర్

తెలంగాణ గురుకుల ప్రవేశ పరీక్ష నిర్వహించిన నేపథ్యంలో కలెక్టర్ వెంకటేష్ ధోత్రే స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన సెంటర్‌ను పరిశీలించారు. విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. పరీక్ష ప్రశాంతంగా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఇబ్బంది కాకుండా చూడాలన్నారు.



ఆసిఫాబాద్ : పరీక్ష కేంద్రాన్ని సందర్శించి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్



సిర్పూర్(టి) : విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

సెంటర్లు దొరకక విద్యార్థుల ఇబ్బందులు

జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన గురుకుల ప్రవేశ పరీక్షకు సంబంధించి సెంటర్ల వివరాలను ఫోన్ల ద్వారా విద్యార్థులకు తెలియజేశారు. ఉదయం సెంటర్లకి చేరుకోవడానికి నానా తిప్పలు పడాల్సి వచ్చింది. పలుచోట్ల సెంటర్లు దొరకక తల్లిదండ్రులు ఇబ్బందులు పడడం కనిపించింది.

సిర్పూర్(టి) : తెలంగాణ గురుకులాలో 5వ తరగతి నుండి తొమ్మిదవ తరగతి వరకు అర్హత కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని జిల్లా కోఆర్డినేటర్ డి. శ్రీనివాసరావు తెలిపారు. జిల్లాలో మొత్తంగా 10 కేంద్రాలు ఏర్పాటు చేయగా 3893 మంది ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. 3828 విద్యార్థులు హాజరు కాగా, 65 మంది విద్యార్థులు గైర్హజరైనట్టు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పరీక్ష జరిగిందన్నారు.

సీఎం సమావేశాన్ని విజయవంతం చేయాలి



చింతలమానేపల్లి: కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ

నవతెలంగాణ-చింతలమనేపల్లి

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మంచిర్యాలలో నిర్వహించే ప్రచార సభలో సీఎం రేవంత్ రెడ్డి హాజరు కానున్నారని ఎమ్మెల్సీ దండే విఠల్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో పట్టభద్రులతో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ నేడు మంచిర్యాలలో నిర్వహించే సీఎం రేవంత్ రెడ్డి సభను విజయవంతం చేయాలన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మద్దతుగా పట్టభద్రుల సమావేశానికి అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే తెలంగాణలో అభివృద్ధి జరుగుతుందన్నారు. అనంతరం ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు డుబ్బుల నానయ్య, సిడం గణపతి, బింకరి నారాయణ, ఉమ్మ మహేష్ పాల్గొన్నారు.

కౌటాల : కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపించాలని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ అధ్యక్షులు విశ్వప్రసాద్‌తో కలిసి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మొదటి ప్రాధాన్యత ఓటు కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థికి వేసి గెలిపించాలని కోరారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారం చేపట్టిన తరువాత 55 వేల ఉద్యోగాలు కల్పించడం జరిగిందన్నారు. ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు చేశామని గుర్తు చేశారు. పట్టభద్రులు శాసనమండలి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విశ్వనాథ్, మండల నాయకులు, యువకులున్నారు.

ఆసిఫాబాద్ : ఈనెల 27న నిర్వహించే పట్టభద్రుల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జిల్లా కేంద్రంలోని నూర్‌నగర్ 12వ వార్డులో ఎన్ఎస్‌యూఐ నాయకులు కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి తరపున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంవత్సర కాలంలో తమ ప్రభుత్వం ఎన్నో రకాల సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో గతంలో ఎన్నడు లేని విధంగా 50 వేలకుపైగా ఉద్యోగాలు భర్తీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అసెంబ్లీ అధ్యక్షుడు మహమ్మద్ జమీర్ అహ్మద్, నాయకులు ప్రదీప్, సౌమిత్ పటేల్, అర్బజ్, ఆకాష్, సమీర్, షహబాజ్ పాల్గొన్నారు.



కౌటాల : కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ, నాయకులు



ఆసిఫాబాద్ : ప్రచారం నిర్వహిస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

శివాజీ మహారాజ్ ఆదర్శప్రాయుడు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

శివాజీ మహారాజ్ ఆదర్శప్రాయుడని బీజేపీ జిల్లా నాయకుడు బోనగిరి సతీష్ బాబు అన్నారు. జిల్లా కేంద్రంలోని బెలూన్ థియేటర్‌లో శివాజీ మహారాజ్ గొప్పతనం ప్రతి ఒక్కరికి తెలిసే విధంగా చేయడంలో భాగంగా సినిమా ప్రదర్శన చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణలో భాగంగా సినిమా ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శివాజీ మహారాజ్‌తో పాటు ఆయన కుమారుడు శంభాజీ మహారాజ్ ఎంతో గొప్పవీరులని కొనియాడారు. ఆయన చరిత్ర నేటి తరాలకు తెలియాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. దీన్ని ఉద్దేశించి సినిమా ప్రదర్శన చేసినట్టు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పుర ప్రముఖులు తాటిపల్లి అశోక్, తాటిపెల్లి వివేక్, తాడిపల్లి దిలీప్, కోటేశ్వరరావు, న్యాయవాదులు చరణ్ తేజ పాల్గొన్నారు.



ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కృషి

- మండల విద్యాధికారి వేణుగోపాల్

నవతెలంగాణ-సిర్పూర్(టి)



గత విద్యా సంవత్సరం కంటే ఈ విద్యా సంవత్సరంలో 100శాతం ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని మండల విద్యాధికారి వేణుగోపాల్ తెలిపారు. పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో ఆయన నవతెలంగాణతో మాట్లాడారు. మండలంలో ఉన్నత పాఠశాలలో 9, ప్రభుత్వ పాఠశాలలు 1, ప్రయివేట్ పాఠశాల ఉన్నాయని తెలిపారు. గతంలో జిల్లా స్థాయిలో 85 శాతం ఉత్తీర్ణతతో మండలం ఐదో స్థానంలో నిలిచింది. ప్రస్తుతం జిల్లాలో మొదటి లేదా రెండో స్థానంలో తీసుకువచ్చేలా విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలలో మొత్తం 635 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని వివరించారు. పరీక్ష రాసే విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం శిక్షణ, తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తూ, పాఠశాల సమయం ముగిసిన తర్వాత సాయంత్రం ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తు అల్పాహారం అందిస్తున్నామన్నారు. కాగా మండలంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల, బాలుర, జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. రానున్న వేసవి కాలం దృశ్య పరీక్ష కేంద్రాల ఆవరణలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాలను కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సారి జరిగే పదవ తరగతిలో విద్యార్థులు మంచి ఉత్తీర్ణత శాతం సాధించడంతో పాటు ఒత్తిడి లేకుండా పరీక్షలకు హాజరయ్యేల కార్యక్రమాలను నిర్వహించలని ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణాలు ఇచ్చామని వివరించారు. విద్యార్థులు కూడా కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల సర్ సిల్క్‌లో ఏడవ తరగతి చదివిన 1985-86 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనము రస్ గ్రాండ్ లాడ్జ్ రైల్వే స్టేషన్ రోడ్‌లో జరిగింది. ఉపాధ్యాయులను శాలువాతో సత్కరించి మెమొంటోలను అందించారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ప్రధానోపాధ్యాయులైన ఆర్.వెంకటయ్య, ఉపాధ్యాయులు వసంతరావు, ప్రసాదరావు, కమలా, బాయమ్మలను సన్మానించి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో తన్నీరు రవి, వెనగంటి శ్రీనివాస్, మోయిస్, బాబా, ముక్తార్లు పాల్గొన్నారు.

ప్రతి లంబాడి సేవాలాల్ దీక్ష స్వీకరించాలి



నవతెలంగాణ-కెరమెరి

ప్రతి తాండ నుండి ప్రతి ఒక్కరు సేవాలాల్ దీక్ష స్వీకరించాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రూప్ లాల్ నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఈనెల 26 మహా శివరాత్రి నుంచి 41 రోజుల పాటు కొనసాగే ఈ దీక్షను నియమ నిష్ఠలతో చేపటాల్సి ఉంటుందన్నారు. సేవాలాల్ దీక్షతో ప్రజల్లో భక్తిభావం పెంపొందుతుందన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ 41రోజుల పాటు చేపట్టే ఈ దీక్షను కొత్తపల్లిలోని ప్రేమ్‌సింగ్ మహారాజ్ ఆధ్వర్యంలో తీసుకోవాలన్నారు. ఇందులో సేవాలాల్ సేన మండల అధ్యక్షుడు రాథోడ్ రమేష్, నాయకులు పాల్గొన్నారు.

ముప్పై ఐదేండ్ల తరువాత కలిసి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఓల్డ్) కాగజ్‌నగర్ విద్యార్థుల గెట్ టుగెదర్ కార్యక్రమాన్ని పద్మశాలి భవన్‌లో నిర్వహించారు. ఉపాధ్యాయులు ఏఎస్ఆర్ మూర్తి, చక్రపాణి, శేషావతారం, భీమసెన్ గుప్తా, రాజయ్య, బాపా గౌడ్, వీటీసీ వేంకటేశ్వర రావు, జయప్రద పాల్గొన్నారు. తమకు పాఠాలు చెప్పిన ఆనాటి గురువులను ఘనంగా సన్మానించి గురు భక్తిని చాటుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు తమ ముప్పై ఐదేండ్ల క్రితం జ్ఞాపకాలను గుర్తు చేసుకొని మురిసిపోయారు. ఈ కార్యాక్రమంలో అకెన పల్లి శ్రీనివాస్, తౌటి మల్లేష్, సుంకరి సత్యనారాయణ, సయ్యద్ సాబీర్, మాచర్ల వినోద, ముక్తవరం పద్మ, సుంక శారద, మచ్చ ఉమా, విజయలక్ష్మి హాస్య పాల్గొన్నారు. ముందుగా తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు రామారావు, చెన్నకేశవ, నర్సయ్య, రాంచందర్, మహమూద్‌తో పాటు తోటి మిత్రులు నక్క ప్రభాకర్, టీ.రమేష్ మృతికి సంతాపం ప్రకటించారు.

గట్టుమల్లన్నకు వెండి పడుగ సమర్పించిన భక్తుడు

నవతెలంగాణ-జైపూర్



వేలాల గట్టుమల్లన్నకు హైదరాబాద్‌కు చెందిన భక్తుడు వెండి నాగ పడుగ సమర్పించాడు. గట్టుమల్లన్న భక్తుడు తిమ్మారెడ్డి-నివేదితరెడ్డి దంపతులు ఆదివారం వేలాల గట్టుమల్లన్న దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రూ.70 వేల విలువగల నాగ పడుగను సమర్పించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ఈఓ రమేష్‌తో పాటు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ భగవంతరావు, ఎఫ్‌బీఓ శ్రీధర్, గ్రామ పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ డేగ నగేష్ పటేల్, నాయకులు ప్యాగ లక్ష్మన్ ఉన్నారు.

ప్రశాంతంగా ముగిసిన గురుకుల ప్రవేశ పరీక్ష

నవతెలంగాణ-లక్షెట్టిపేట

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ప్రవేశం కోసం ఆదివారం రోజు నిర్వహించిన గురుకుల టీజీసెట్ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు గురుకుల ప్రిన్సిపల్ కె రమణ కళ్యాణి తెలిపారు. 5వ తరగతి విద్యార్థులకు కామన్ ఎంట్రన్స్ టెస్ట్, 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు గల బ్యాక్లాగ్ వేకెన్సీల ప్రవేశ పరీక్షకు సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ సొసైటీలకు సంబంధించి, పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని తెలిపారు. మొత్తం 674 విద్యార్థులకు 658 మంది విద్యార్థులు హాజరు అవ్వగా 16 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మహేశ్వరరావు పాల్గొన్నారు.



టీజీసెట్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలోని ఇటిక్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలను శనివారం రాత్రి పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమన్ని కాంగ్రెస్ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి హెలెన్ డారతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంది సహకారంతో పాఠశాల అభివృద్ధి చెందుతుందని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరల్ అధికారి చౌదరి, సత్యనారాయణ మూర్తి, ఏఎస్ఓ రాజ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వామనుమూర్తి, గ్రామా పెద్దలు క్రిష్ణయ్య లక్మణ్, తిరుపతి , శ్రీనివాస్, దేవ, రామయ్య కుమార్ స్వామి, మహేష్, రత్నాకర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



నవతెలంగాణ-జన్నారం

అన్ని వర్గాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని జన్నారం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఫసిఉల్లా అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మండల కేంద్రంలోని పలు కాలనీలలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన పట్టభద్రులను కలిశారు. పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి నరేందర్‌రెడ్డి కృషి చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డి.రమేష్, ఇందయ్య, ఎన్ఎస్‌యూఐ నాయకులు సోహెల్ షా ఉన్నారు.

'కృతజ్ఞత సభను విజయవంతం చేయండి'

రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేసినందున ఈ నెల 25న ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కృతజ్ఞత సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఇందయ్య అన్నారు. ఆదివారం మీడియాతో మాట్లాడారు. మందకృష్ణ మాదిగ 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాట ఫలితంగానే కాంగ్రెస్ ప్రభుత్వం వర్గీకరణకు పూనుకుందన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని శ్రీ లక్ష్మి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో 22 ఏళ్ల క్రితం 2002-03లో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. మరణించిన గురువులను, తోటి విద్యార్థులను గుర్తు చేసుకొని నివాళులు అర్పించారు. విద్యార్థి దశలో తమ అనుభవాలను గుర్తు చేసుకున్నారు. తమ జీవితాల్లో సాధించిన విజయాల గురించి వేదికపై పంచుకున్నారు. సమ్మేళనానికి హాజరైన గురువులు రవీందర్, కనకయ్య, రాజలింగు, దిలీప్‌లను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికాలను అందజేశారు. అలాగే గురువుల పూర్వ అనుభూతులను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తుల సౌకర్యార్థం నీటి సరఫరా

- శ్రీరాంపూర్ సీఐ వేణు చందర్



నవతెలంగాణ-జైపూర్

గట్టుమల్లన్న దర్శనార్థం వేలాల జాతరకు వచ్చే భక్తులకు తాగు నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నట్లు శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ తెలిపారు. స్థానిక ఎస్ఐ శ్రీధర్‌తో కలిసి ఆదివారం గట్టుమల్లన్న భక్తుల సౌకర్యార్థం నీటి సరఫరాను ప్రారంభించారు. గట్టుమల్లన్న ప్రాంగణంలో తాగు నీటికి ఇబ్బందులు లేకుండా ముందు జాగ్రత్తగా సబ్ మెర్సిబుల్ విద్యుత్ మోటర్ల ద్వార నీటి సరఫరా కొనసాగించనున్నట్లు తెలిపారు. ఆలయ ముఖ ద్వారం ఎదుట భక్తుల క్యూలైన్ల వెడల్పుతో ఇప్పటికే సిమెంట్‌తో ఫ్లోరింగ్ చేయించినట్టు తెలిపారు. గతంలో నిర్మించిన ఘాట్ రోడ్డు వరకు కొత్తగా సిమెంట్ ఫ్లోరింగ్ చేయించడమే కాకుండా వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. వసతుల కల్పనపై పోలీస్ ఉన్నతాధికారుల సూచనల మేరకు స్థానిక ఎస్ఐ పర్యవేక్షణలో గత వారం రోజులుగా ఏర్పాట్లు కొనసాగుతున్నాయని తెలిపారు.

కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్



మండల కమిటీ సమావేశంలో సమావేశంలో మాట్లాడుతున్న రంజీత్‌కుమార్

నవతెలంగాణ-జైపూర్

తెలంగాణ రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ అన్నారు. చెన్నూర్ పట్టణంలో గల మేస్త్రీ సంఘం భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన సీఐటీయూ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా అంగన్‌వాడీ ఉద్యోగులకు ఇచ్చిన హామీని అమలు చేయకపోవడం సరికాదన్నారు. మినీ అంగన్‌వాడీ టీచర్‌ను మెయిన్ టీచర్‌గా ప్రమోట్ చేసినప్పటికి పాత వేతనమే చెల్లిస్తున్నారని అన్నారు. అదేవిధంగా అంగన్‌వాడీ ఉద్యోగులకు ఐసీడీఎస్‌తో సంబంధం లేని పనులు చేయిస్తున్నారని విమర్శించారు. ఆఫ్‌లైన్ ఆన్‌లైన్ పనులు చేయాలంటూ ప్రతి రోజు జీపీఎస్ ద్వార ఫోటోలు పెట్టాలని అధికారుల ఒత్తిడి అంగన్‌వాడీలను వేదిస్తున్నారని ఆవేధన వ్యక్తం చేశారు. ఖాళీగా ఉన్నటువంటి అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ పోస్టులు భర్తీ చేయకుండా ఇతర కేంద్రాలకు అదనపు బాధ్యతలు అప్పగించడం సరికాదని అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇంటి అద్దెలు, గ్యాస్ బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కేంద్రాలకు ప్రతి నెల సరఫరా చేయాల్సిన వస్తువులు సకాలంలో సరఫరా చేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొవల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయని తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు, ఇంటి అద్దెలు పెంచాలని, అంగన్‌వాడీ కేంద్రాలకు కనీస సౌకర్యాలు కల్పించాలని, అంగన్‌వాడీల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని కనీస వేతనాలు పెంచడమే కాకుండా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉద్యోగుల యూనియన్ నాయకులు ప్రవీణ, శారధ, విజయ, ఉమారాణి, కరీంబీ, బోడంకి చందు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ తేమ పేరుతో రైతులను మోసం చేసింది

- నేటి సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలి
- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు

నవతెలంగాణ-మంచిర్యాల

గత బీఆర్ఎస్ ప్రభుత్వం తేమ పేరుతో రైతులను మోసం చేసిందని, ప్రస్తుతం కాంగ్రెస్ బోనస్ ప్రకటించడం లేదని బీఆర్ఎస్ నాయకులు ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఎద్దేవ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని బలపరుస్తూ సీఎం రేవంత్‌రెడ్డి మంచిర్యాల పర్యటకు సోమవారం రానున్నట్టు తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ ఆదిలాబాద్ మెదక్ నిజామాబాద్ పట్ట బద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. 16500 మంది పట్ట భద్రుల ఓటర్లు మంచిర్యాల నియోజక వర్గంలో ఉన్నారని మేధావులు విద్య వంతులు మొదటి ప్రధాన్యత ఓటు కాంగ్రెస్ అభ్యర్థికి వేసి గెలిపించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి 50 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, ఎన్ని అడ్డంకులు ఏర్పడిన గ్రూప్-1 పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఇచ్చిన హామీ ప్రకారం 2 లక్షల ఉద్యోగాలు బర్తి చేస్తామన్నారు. బీఆర్ఎస్ హయంలో రైతులు, గ్రామ సర్పంచ్ లు నిండా మునిగారాని బీఆర్ఎస్ ప్రభుత్వం ఎగొట్టిన బిల్లులను కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేస్తుందని హామీ ఇచ్చారు. బస్తాకు రెండు కిలోల తేమ పేరుతో ఎకరాకు రెండు క్వింటాల్లు ధాన్యాన్ని పక్క దారి పట్టించి రైతులను బీఆర్ఎస్ మోసం చేసిందని విమర్శించారు. జిల్లాలో రైతుల పేరు మీద రూ.50 కోట్లు నొక్కేషరని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హాయంలో పుట్ట గొడుగుల్లా రైస్ మిల్లులు ఏర్పడ్డయని ఇప్పుడు అవన్నీ మూత పడే సమయం వచ్చిందని ఎప్పటికైనా రైతులను మోసం చేసిన వారు శిక్ష అనుభవిస్తారని పేర్కొన్నారు. పట్ట భద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారంలో భాగంగా మంచిర్యాలకు సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్నారని నస్పూర్‌లో జరిగే సీఎం సభకు సీఎంతో పాటు టీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, మంత్రులు సీతక్క, శ్రీధర్‌బాబు హాజరవుతున్నట్టు పేర్కొన్నారు. అర్హత కలిగిన పట్ట బద్రుల ఓటర్లు జిల్లా ప్రజలు పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అగ్రకులాల ఎంఎల్సీ అభ్యర్థులను ఓడించండి

నవతెలంగాణ-నస్పూర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ అభ్యర్థి మంద జ్యోతి

ఉమ్మడి మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో అగ్రకుల ఎమ్మెల్సీ అభ్యర్థులను ఓడించి, దళిత, పీడిత, అణగారిన ప్రజల అభ్యర్థి అయిన తనను గెలిపించాలని ధర్మ సమాజ్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి మంద జ్యోతి అన్నారు. ఆదివారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్పొరేట్ స్థాయిలో విద్యను వ్యాపారంగా చేసుకొని ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని, వారి సంపదను, అగ్రకుల వర్గ ప్రయోజనాలను కాపాడుకునేందుకే పోటీలలో ఉన్నారని ఆరోపించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఎదగాలంటే దళిత మహిళ అయిన తనకు ఓటు వేసి గెలిపించాలన్నారు. అలాగే పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్లకు భరోసానిచ్చే అభ్యర్థి మంద జ్యోతికి విలువైన మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని, దళిత మహిళనైన తనను ఆదరించాలని, నాలుగు ఉమ్మడి జిల్లాల పట్టబద్రులను అభ్యర్థిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా అగ్రకుల చెంచాలు కార్పొరేట్ శక్తులైన బీజేపీ, కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు తగిన బుద్ధి చెప్పాలని, బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యం పట్టభద్రుల భద్రత ధర్మ సమాజ్ పార్టీతోనే సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జంగపెల్లి రామస్వామి, నందిపాటి రాజు, ఏదునూరి రమేష్, రేగుంట రాకేష్, కనకరాజు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి సభను విజయవంతం చేయాలి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

నవతెలంగాణ-జన్నారం

మంచిర్యాల జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించే సీఎం రేవంత్‌రెడ్డి సభను కాంగ్రెస్ కార్యకర్తలు విజయవంతం చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, ఎమ్మెల్సీ నియోజకవర్గ సమన్వయకర్త కాసుల బాలరాజు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆర్ఆర్ గార్డెన్‌లో కాంగ్రెస్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముందుగా ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌ను కాంగ్రెస్ నాయకులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సభకు కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ నరేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. పట్టభద్రులకు ఉద్యోగులకు, కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుంది అన్నారు. రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు దక్కాలంటే కాంగ్రెస్ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పట్టబద్రులను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ముజాఫర్ అలీఖాన్, మేకల మాణిక్యం, మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ పసియుల్లా, నాయకులు సుభాష్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మిక్కిలిదేని రాజశేఖర్, మత్స్య శంకరయ్య పాల్గొన్నారు.

జాతరకు ముందే భక్తుల రాకపోకలు



నవతెలంగాణ-జైపూర్

మహా శివరాత్రిని పురస్కరించుకుని మూడు రోజుల పాటు నిర్వహించుకునే జాతరకు భక్తుల రాకపోక ముందే మొలయ్యాయి. గత వారం రోజులుగా భక్తులు వస్తూ పోతూవుండగా ఆదివారం అత్యధికంగా ఐదు నుండి ఆరు వేల మంది మల్లన్న దర్శనార్థం వేలాలకు తరలివచ్చారు. ఈ నెల 26 నుండి 28 వరకు జాతర నిర్వహించగా ముందుగానే భక్తులు వస్తుండటంతో వసతుల కల్పనపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా తాగు నీటి సరఫరా మరింత మెరుగుపర్చాలని కోరుతున్నారు. గట్టుమల్లన్న గుట్టపై భక్తులకు అందుబాటులో నీటి వసతి కల్పించాలని కోరుతున్నారు. చంటి పిల్లలతో సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులకు తాగు నీటికి ఇబ్బందులు లేకుండా అధికారుల చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి విజయానికి కృషి చేయాలి

నవతెలంగాణ-తాండూర్

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ సూచించారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బెల్లంపల్లి పట్టణ స్థాయి కాంగ్రెస్ నాయకులు, పట్టభద్రులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అల్ఫోర్స్ అధినేత వూట్కూరి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. బెల్లంపల్లి పట్టణంలోని ఏఎండీ గ్రౌండ్‌లో చేపట్టిన ప్రీమియర్ లీగ్(1) క్రికెట్ పోటీలను ప్రారంభించారు. అనంతరం బెల్లంపల్లి పట్టణ కేంద్రంలో బంజారాలు నిర్వహించిన సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే పాల్గొన్న వివిధ కార్యక్రమంలో ఆర్డీఓ హరికష్ణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య, జక్కుల శ్వేత శ్రీధర్, నాతరి స్వామి పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితేనే మంచి ఫలితాలు



నవతెలంగాణ-మందమర్రి

రాబోయే పరీక్షలకు విద్యార్థినిలందరూ క్రమశిక్షణతో చదివితేనే మంచి ఫలితాలు సాధించవచ్చునని సింగరేణి కళాశాల కరస్పాండెంట్ హీరాలాల్ ఉపాధ్యాయ సూచించారు. ఆదివారం అందుగులపేట సింగరేణి మహిళ కళాశాలలో జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలల ఫేర్వెల్ పార్టీని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినిలు ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా హీరాలాల్ ఉపాధ్యాయ మాట్లాడుతూ, సేవాభావం కలిగిన విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. కళాశాలలో ఇలాంటి వేడుకలు నిర్వహించడం సంతోషంగా ఉందని ఆనందాన్ని వ్యక్తం చేశారు. పరీక్షలకు ముందు విద్యార్థులకు మంచి ఆటవిడుపు లభించి, పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు దోహదపడుతుందని తెలిపారు.

ప్రారంభమైన రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు



నవతెలంగాణ-మందమర్రి

మందమర్రి సీఐఎస్ఎఫ్ బ్యారెక్స్‌లో తెలంగాణ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలను ఆదివారం రెండవ రోజు బీజేపీ అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, దారా రవి, సాగర్, రజిని దంపతులు ప్రారంభించారు. పోటీలకు వివిధ జిల్లాల నుంచి 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌గౌడ్, రవి సాగర్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు ఎదుగుదలకు క్రీడలు ముఖ్యమని ప్రతి ఒక తల్లిదండ్రులు క్రీడలను ప్రోత్సహించాలని పిల్లలకు శారరీకంగా మానసికంగా దఢత్వాన్ని ఇస్తుందని చెప్పారు. రానున్న బీజేపీ ప్రభుత్వంలో ప్రతి పాఠశాలలో కరాటేను తప్పనిసరి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రంగు శ్రీనివాస్, మాయ రమేష్, బీజేపీ నాయకులు ధారా రవి సాగర్ రజని, అక్కల రమేష్, దుర్గం అశోక్, దీక్షితులు, సప్పిడి నరేష్, కరాటే మాస్టర్లు హరికృష్ణ, భూమయ్య, సంతోష్, పోచంపల్లి వెంకటేష్ పాల్గొన్నారు.

డైరెక్టర్‌ను సన్మానించిన ఎస్టీపీపీ అధికారులు

నవతెలంగాణ-జైపూర్

ఈ నెలలో పదవి విరమణ పొందనున్న సింగరేణి మాజీ డైరెక్టర్(పీపీ అండ్ పా) వెంకటేశ్వర్‌రెడ్డిని ఎస్టీపీపీ అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆదివారం ఎస్టీపీపీలో ఏర్పాటుచేసిన ప్రత్యేక వేదిక మీదుగా మార్కెటింగ్ జీఎంగా పదోన్నతి పొందిన ఎస్టీపీపీ ఎస్‌వీ రాజశేఖర్‌రావుని కూడా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జీఎం(ఈ అండ్ ఎం) కె శ్రీనివాసులు, చీఫ్ ఆఫ్ ఓ అండ్ ఎం జేఎన్ సింగ్, ఏజీఎం(సివిల్) ప్రసాద్, ఏజీఎం(ఫైనాన్స్) సుధాకర్, సీఎం ఒఏఐ బ్రాంచ్ ప్రెసిడెంట్ సముద్రాల శ్రీనివాస్, ఎస్ఓటు ఈడీ ఎం ప్రభాకర్ రావు, డీజీఎం పర్సనల్ అజ్మీరా తుకారాం పాల్గొన్నారు.

నవతెలంగాణ
5
ఆదిలాబాద్
సోమవారం | ఫిబ్రవరి 24, 2025 | www.navatelangana.com

ఎమ్మెల్యే కోవ లక్ష్మిని అవమానించడం సరికాదు

నవతెలంగాణ-నార్నూర్

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన సేవాలాల్ జయంతి రోజున ప్రోటోకాల్ పాటించక ఎమ్మెల్యే కోవ లక్ష్మీని అవమానించడం సరికాదని, వెంటనే ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని మాజీ జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులతో మీడియాతో మాట్లాడారు. సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతినీ అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జరిగిన జయంతి సభ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కోవ లక్ష్మీ పేరు అధికారులు ప్రోటోకాల్ పాటించలేదని దీంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేను అవమానించడ సరైనది కాదని వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ క్షమాపన చెప్పాలని డిమాండ్ చేశారు. క్షమాపన చెప్పకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమం చేపడుతామని హెచ్చరించారు. ఇందులో ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ శ్రీరాం నాయక్, ప్యాక్స్ ఇన్‌ఛార్జి చైర్మెన్ సురేష్ ఆడే, నాయకులు ఫేరోజ్, రాథోడ్ రమేష్, లోకండే చంద్రశేఖర్, రాథోడ్ సుభాష్, రామేశ్వర్, దిలీప్, జితేందర్, బాబా ఖాన్, శివాజీ, మోహన్ ఉన్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి

నవతెలంగాణ-సారంగాపూర్



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కాంగ్రెస్ మండలాధ్యక్షులు బొల్లోజి నర్సయ్య అన్నారు. ఆదివారం మండలంలోని జామ్, నాగపూర్, అడెల్లి, రవీంద్రనగర్, తాండ్ర, కంకెట గ్రామాల్లో పట్టభద్రులను కలిసి ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ జిల్లాల కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు నవీన్‌రెడ్డి, నారాయణరెడ్డి, రాము, సురేందర్, భూమన్న, పోతన్న, యువకులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయ పునర్నిర్మాణం



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని 12వ వార్డులో కొలువుదీరిని మైసమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణ భాగ్యం తనకు కలగడం అమ్మవారి దయతోనేనని సామాజిక కార్యకర్త, సొసైటీ డైరెక్టర్ చట్ల ఉమేష్ అన్నారు. గత కొన్ని దశాబ్దాలుగా 12వ వార్డులో కొలువుదీరిన మైసమ్మ ఆలయ పునర్నిర్మాణాన్ని ఆదివారం తన సొంత నిధులతో ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ప్రత్యేక పూజలు నిర్వహించి, శివసత్తుల ఆధ్వర్యంలో బోనాల కార్యక్రమం నిర్వహించారు. కాలనీలోని మైసమ్మ ఆలయం ముందు సీసీ రోడ్డు ఎత్తు పెరగడంతో ఆలయం లోతుకు వెళ్లింది. దీంతో కాలనీ వాసులు ఈ విషయాన్ని ఉమేష్ దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే స్పందించిన ఆయన తాను ఆలయ పునర్నిర్మాణాన్ని పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రారంబించడంతో పాటు కావాల్సిన ఏర్పట్లను సైతం తానే కల్పిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ఆయనకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు సురేష్ వైద్య, మురళీ, సిహెచ్.బ్రహ్మానందం, పోతారెడ్డి, రాజు, మంచికుంట గంగాధర్, కూన రాము, కోల గంగయ్య, రమేష్, బింటూ, సురేందర్, లక్ష్మణ్, కాలనీ మహిళలు, హనుమాన్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో నాయకుల ప్రచారం

నవతెలంగాణ-కామారెడ్డి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలోని ఖానాపూర్ నియోజకవర్గంలో ఆదివారం పలు మండలాల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మద్దతుగా ఆగ్రో చైర్మన్ కాసుల బాలరాజు, జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని, యువతకు ఉపాధి కల్పనలో భాగంగా చేపట్టిన ఉద్యోగ కల్పనను దృష్టిలో పెట్టుకొని , రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నందున మొదటి ప్రాధాన్యత ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి నరేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలుపొందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కారు మిర్రర్ పగలగొట్టిన టోల్ ప్లాజా సిబ్బందిపై ఫిర్యాదు

నవతెలంగాణ-భిక్కనూర్

కారు మిర్రర్ పగలగొట్టిన టోల్‌ప్లాజా సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలంలోని తిప్పాపూర్ గ్రామానికి చెందిన కారు మెకానిక్ శ్రీకాంత్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. ఆయన వివరాల ప్రకారం.. మెకానిక్ శ్రీకాంత్ తన కారు కామారెడ్డి వైపు తీసుకెళ్తున్న సమయంలో టోల్ ప్లాజాలో తాను లోకల్ తిప్పాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తిని అని చెప్పిన పంపించలేదు. టోల్ ప్లాజాలో పనిచేస్తున్న రణదీప్ రెడ్డి అనే వ్యక్తి టోల్ బూత్ వద్దకు వచ్చి కారు ఫాస్ట్ ట్రాక్ తీసుకొని కారు పక్కకు తీస్తున్న సమయంలో సిబ్బంది కారు మిర్రర్ విరగొట్టి దురుసుగా ప్రవర్తించినట్టు తెలిపారు. ఆగ్రహం చెందిన శ్రీకాంత్ టోల్ ప్లాజా సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ప్రతినిత్యం టోల్ ప్లాజా లో పనిచేస్తున్న సిబ్బంది దురుసుతనం కారణంగా వాహనదారులతో గొడవలు జరుగుతున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. వాహనదారులతో గొడవలు జరగకుండా టోల్ ప్లాజా యాజమాన్యం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వాహనదారులు తెలియజేస్తున్నారు.

పదవ తరగతి టాలెంట్ టెస్ట్ నిర్వహించిన పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-కామారెడ్డి/బీబీపేట్

తిమ్మయ్య గారి సుశీల నారాయణరెడ్డి బాలుర ఉన్నత పాఠశాల బిబిపేటలో ఆదివారం 2003 - 2004 ఎస్ఎస్సి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు పదవ తరగతి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ టాలెంట్ టెస్ట్‌కు మండలంలోని ఐదు పాఠశాలకు సంబంధించిన విద్యార్థులు 109 మంది పాల్గొన్నారు. టాలెంట్ టెస్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులను అందించారు. ఇందులో తిమ్మయ్య గారి సుశీల నారాయణరెడ్డి ఉన్నత పాఠశాల బీబీపేటకు చెందిన పదవ తరగతి విద్యార్థిని కుమారి అక్షయ ప్రథమ స్థానం సాధించి 3000 రూపాయల నగదు ప్రోత్సాహక బహుమతిని అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ మూల రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయ బృందం కుమారి అక్షయను అభినందించారు.

కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలి

నవతెలంగాణ-కామారెడ్డి

పట్టభద్రుల ఎమ్మెల్సీగా అల్ఫోర్స్ వూట్కూరి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాదన్యత ఓటు వేసి భారీ మేజారిటితో గెలపించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యాక్షులు తలారి ప్రభాకర్ అన్నారు. కామారెడ్డి జిల్లా బీబీపేట మండలం తుజాల్ పూర్ గ్రామంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి చెందుతుందని అన్నారు. విద్యావంతులు, మేధావులు, యువకులంత ఎకమై నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. అధికారంలోకి వచ్చిన ఎడాదిన్నర కాలంలో 50 వేలకి పైగా ఉద్యోగాలని ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉందని అన్నారు. ఆయా ప్రైవేటు రంగాలలో విధులు నిర్వహిస్తున్న పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గోనే నర్సయ్య మేడిపల్లి ప్రశాంత్, అందే శ్రీదర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పనిచేయని టెలివిజన్లు

నవతెలంగాణ-జుక్కల్

మండల కేంద్రంలోని బస్టాండ్‌లో రెండు టెలివిజన్లు ఉన్నా పనిచేయడం లేదు. టిఎస్ ఆర్‌టిసి పట్టించుకోక పోవడంతో మూలకు పడ్డాయి. ఆర్టీసీ ప్రయాణికుల కొరకు ఈ టెలి విజన్లు ఎంటర్‌టైన్‌మెంట్ కొరకు ఏర్పాటు చేశారు. ప్రయాణికులకు బోర్ కొట్టకుండా ఉత్సాహ పరిచేందుకు టెలివిజన్‌లు అందుబాటులో ఉంచారు. అదేవిధంగా అడ్వర్టైజ్మెంట్ ద్వారా ఆర్టీసీకి కొంత లాభం వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికైనా ప్రయాణ ప్రాంగణంలో ఉన్న టెలివిజన్లను మరమ్మత్తులు చేయించి, ప్రజాధనం వృథా కాకుండా వాటిని ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం వచ్చేలా ఉంది
- సీఎంలు మాత్రమే మారారు..పాలనలో మార్పు లేదు
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు
- బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆరుగ్యారెంటీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ప్రజలు వీటి అమలుపై ప్రశ్నిస్తున్నారని ఈ 14 నెలల్లోనే కాంగ్రెస్ సర్కారుపై తీవ్ర వ్యతిరేకత వచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ పాలనపై అన్ని వర్గాల్లో అసంతృప్తి వ్యక్తమవుతోందని వివరించారు. రాష్ట్రంలో జెండాలు, సీఎంలు మాత్రమే మారారని పాలనలో మాత్రం ఎలాంటి మార్పులు కనిపించడం లేదని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం కోసం ఆదిలాబాద్‌కు వచ్చిన ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, హరీష్‌బాబు, ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పతాంగే బ్రహ్మానంద్‌తో కలిసి మాట్లాడారు. అధికారంలోకి వస్తే వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ 400రోజులు దాటినా అమలు చేయడం లేదని దుయ్యబట్టారు. ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపిస్తోందని, అభయహస్తం మొండిహస్తంగా మారిందని విమర్శించారు. పది పంటలకు బోనస్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం సన్నరకాలకు కూడా ఇవ్వలేకపోతోందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వాల్సిన ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని సీపీఎస్ రద్దు చేస్తామని చెప్పి చేయలేదని గుర్తుచేశారు. ఏడాదిలో 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేదని విమర్శించారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి దివాళా తీసిందని మాజీ సీఎం కేసీఆర్ అనాలోచిత నిర్ణయాల కారణంగా రూ.8లక్షల కోట్ల అప్పు చేశారని ఆరోపించారు. కేసీఆర్, రేవంత్‌రెడ్డిలు ప్రజల భవిష్యత్తును అంధకారంలో నెడుతున్నారని ఈ రాష్ట్రం ఏమైనా పర్వాలేదని భావిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో నిజమైన మార్పు అవసరం ఉందని రానున్న రోజుల్లో బీజేపీ ముందడుగు వేస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారు వస్తుందని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొమురయ్యను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితీష్‌రాథోడ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్రాల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



ఆదిలాబాద్ : పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లో 5వ తరగతితో పాటు 6, 7, 8, 9 తరగతుల్లోని మిగిలిన ఖాళీలను భర్తీ చేసేందుకు ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు పరీక్ష కొనసాగింది. ప్రవేశ పరీక్షకు 4,198 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకోగా ఇందులో 181 మంది గైర్హాజైనట్టు డీసీఓ లలిత తెలిపారు. వీరికోసం 10 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఆయా పరీక్ష కేంద్రాలకు సమయం కంటే గంట ముందే చేరుకున్నారు. కాగా విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతనే లోనికి అనుమతించారు. ఇదిలా ఉంటే పరీక్ష కేంద్రాలను డీసీఓ ఎ.లలిత పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ముథోల్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన గురుకుల 5వ తరగతి ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం నుండే ఆయా గ్రామాల నుంచి 5వ తరగతి ప్రవేశ పరీక్ష రాసేందుకు విద్యార్థులు తమ పోషకులతో కలిసి పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పరీక్ష కేంద్రంలో 590 విద్యార్థులకు గాను 574 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, 15మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు ప్రిన్సిపాల్ చీఫ్ సూపరింటెండెంట్ నర్సింహారెడ్డి తెలిపారు. డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా శ్రీనివాస్ వ్యవహరించినట్లు వివరించారు. అలాగే జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రంలో 236 మంది విద్యార్థులకు గాను, 234 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 2 విద్యార్థులు గైర్హాజరైనట్టు ప్రిన్సిపాల్, చీఫ్ సూపరింటెండెంట్ అమృత తెలిపారు. డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా శిరీష వ్యవహరించినట్టు తెలిపారు. ఈ పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరిగాయి. ముథోల్ ఎస్సై సంజీవ్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తును నిర్వహించారు.

అధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

- మాజీ మంత్రి జోగు రామన్న



పూజలు చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

అధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత ఉంటుందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. ఆదివారం మండలంలోని యాపల్‌గూడలో నూతనంగా నిర్మించిన రామాలయంలో నిర్వహించిన విగ్రహా ప్రతిష్టాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీ మహాగణపతి, నవగ్రహ, దత్తాత్రేయ, షణ్ముఖ, ఆంజనేయ సహిత శ్రీ సీతారామ లక్ష్మణ విగ్రహ ప్రతిష్టాపనతో పాటు ధ్వజస్తంభ ప్రతిష్టాపన సైతం భక్తి శ్రద్ధలతో జరపగా, చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. శ్రీ రామ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగు రామన్న ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు ఆయనకు సాదర స్వాగతం పలికారు. ఆలయంలో పూజలు జరిపి వేద పండితుల ఆశీర్వచనాలను స్వీకరించారు. గ్రామస్తులంతా ఐక్యంగా ఉండి ఆధ్యాత్మిక వేడుకలను ఘనంగా జరపడం అభినందనీయమని అన్నారు. అనంతరం విగ్రహా ప్రతిష్టాపనాను పురస్కరించుకుని చేపట్టిన ఆధ్యాత్మిక కార్యక్రమాల వివరాలను వేద పండితులు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు గండ్రత్ రమేష్, సెవ్వ జగదీష్ యాదవ్, చందాల ఈశ్వరి రాజన్న, కొండ గణేష్, బట్టు సతీష్, దేవిదాస్, కుమ్ర రాజు, ఉగ్గే విఠల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-బేల

మండలంలోని కొగ్దూర్, పాటన్ గ్రామాలలో ఆదివారం కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డికి మొదటి ప్రధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ ప్రచారంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు ఫైజుల్లాఖాన్, జైనథ్ మార్కెట్ వైస్ చైర్మెన్ విలాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సంజయ్ గుండావార్, శంకర్ భోక్రే, మడావి చంద్రకాంత్, ఠాక్రె సాగర్ పాల్గొన్నారు.

పలు ఆలయాలలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

సోన్ మండలంలోని సోన్ శ్రీరాజరాజేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్టాపన, లోకల్ వెల్మల్‌లో శ్రీవెంకటేశ్వర స్వామి ధ్వజ, శిఖర ప్రాణ ప్రతిష్టాపన కార్యక్రమాల్లో పాల్గొని ఆలయాల్లో నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు మారా గంగారెడ్డి, బీజేపీ నాయకులు సరికెల గంగన్న, నరేష్, నర్సారెడ్డి, నర్సయ్య, రాజేశ్వర్, సంతోష్, ప్రశాంత్, గంగన్న, సాయన్న, అమృత్, రాజు, ఉదయ్ పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా నిలువాలి



నవతెలంగాణ-బేల

నమాజులను ఆచరిస్తూ, తమ తమ పరిసర ప్రాంతాల్లో ఉన్న నిరుపేదలకు అండగా నిలువాలని ఆధ్యాత్మికవేత్త గయాజ్ అహ్మద్ అన్నారు. ఆదివారం మండలంలోని దహెగాం గ్రామంలోని దారుల్ ఉలూమ్ అజీజియా మదర్సా 13వ వార్షికోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. మదర్సాలో దివ్య ఖురాన్‌ను కంఠస్థం చేసిన 8 మంది విద్యార్థులకు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నమాజ్‌లను ఆచరిస్తూ నిరుపేదలకు అండగా నిలువాలని అన్నారు. ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. తమ పిల్లలను మొదటిసారిలో చేర్పించి, దివ్య ఖురాన్ పటిష్టించేలా ప్రతి ఒక్క తల్లిదండ్రులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మదర్సా నిర్వాహకులు అక్బరుద్దీన్, ముస్లింలు పాల్గొన్నారు.

నామమాత్రపు బోర్డుతో ఒరిగిందేమీ లేదు

నవతెలంగాణ-కంఠేశ్వర్

పసుపు పంటకు నిజామాబాద్ మార్కెట్ లో ధర పది వేలు ఉంటే సాంగ్లి మార్కెట్ లో 13 వేలు ఉందని మాజీ మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని బీ అర్ ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బిజెపి ఎంఎస్పి లేని పసుపు బోర్డు పెట్టడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులు మూడు నాలుగు రోజులు పసుపు కుప్పలమీద పడుకునే పరిస్థితి ఏర్పడుతుందని, పసుపు బోర్డు కార్యాలయం డిల్లీలో, చైర్మన్ అంకాపూర్ లో ఎంపీ అరవింద్ హైదరాబా ద్‌లో ఉంటే రైతులకు ఇలాంటి తిప్పలు తప్పవని అన్నారు. నిజామాబాద్ మార్కెట్ గంజ్ చాలా పెద్దదని, నిర్మల్, జగిత్యాల, కోరుట్ల, ఆర్మూర్, బాల్కొండ. రూరల్ నియోజక వర్గాల రైతులు పసుపు క్రయ విక్రయాలు ఇక్కడే జరుపుతారన్నారు. మార్కెట్ లో ఒకటి రెండు కుప్పలకు పదివేలు, పదివేల ఒక్క రూపాయి, రెండు అని చెప్పి మిగితా వారి పసుపు ను తక్కువకు కొంటున్నారన్నారు. ఇనాం లో 10 వేలకు తక్కువ ఇవ్వొద్దని చెప్పిన దళారులు పక్క దారుల్లో 8500 కొంటున్నారన్నారు. కటాప్ రేట్ తగ్గించే ఆలోచనలో అన్నట్లు మాకు సమాచారం ఉందన్నారు. గంజ్ లో ఉన్న ప్రతి కుప్ప ఈ వేలం లో కొనల్సిందే అన్నారు.

ఆదిలాబాద్ వాసికి అరుదైన అవకాశం

- ఇంపీరియల్ కాలేజ్ ఆఫ్ లండన్, కేంబ్రిడ్జ్‌లో పరిశోధనలు చేసే చాన్స్
- మేరిక్యూరి పోస్ట్ డాక్టొరల్ ఫెలోషిప్‌కు ఎంపికైన విద్యాసాగర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ దేవ్‌తాడే విద్యాసాగర్ ప్రపంచంలోనే అత్యుత్తమమైన ఇంపీరియల్ కాలేజ్ ఆఫ్ లండన్, కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు చేసే అవకాశాన్ని దక్కించుకున్నాడు. 96 శాతం స్కోరుతో ప్రతిష్టాత్మక మేరిక్యూరీ పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్‌కి ఎంపికయ్యాడు. ప్రపంచవ్యాప్తంగా అనేక మంది ఈ ఫెలోషిప్‌కు పోటీ పడగా, శక్తి, పర్యావరణ సవాళ్లను తట్టుకునే విధానంలో సుస్థిర సోలార్ కాంతి పరిష్కారాలను అందించడం మీద దృష్టి పెట్టిన అతని పరిశోధనా ప్రతిపాదన ప్రపంచవ్యాప్తంగా ఉన్న పత్రాల మధ్య అత్యుత్తమమైనదిగా నిలిచింది. దీంతో అగ్రశ్రేణి ఆరు శాతం పరిశోధకుల్లో ఆయన ఒకరిగా నిలిచారు.

చిన్న పట్టణం నుంచి..

ఆదిలాబాద్ పట్టణంలోని పిట్టల్‌వాడ కాలనీకి చెందిన దేవ్‌తాడే ఘన్‌శ్యాం శశికళ దంపతుల చిన్న కుమారుడైన విద్యాసాగర్ అనేక సవాళ్లను అధిగమించి తన విద్యాభ్యాసాన్ని పూర్తి చేశాడు. ఆసిఫాబాద్‌లోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో పదో తరగతి వరకు చదివాడు. అనంతరం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని విద్యార్థి జూనియర్ కళాశాలలో ఇంటర్మీయట్, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశాడు. ఆ సమయంలో గురువు సూర్యప్రకాశ్‌తో ప్రేరణ పొంది, ఆయన మార్గదర్శకత్వంతో హైదరాబాద్ యూనివర్సిటీలో సీటు సంపాదించి, స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీ నుండి కెమిస్ట్రీలో మాస్టర్స్ డిగ్రీని పూర్తి చేశాడు. అనంతరం నాగ్‌పూర్‌లోని విశ్వేశ్వరయ్య జాతీయ సాంకేతిక సంస్థ (వీఎన్ఐటీ)లో మెటీరియల్ కెమెస్ట్రీలో పీహెచ్‌డీ చేసి ప్రతిభ కనబర్చాడు.

పరిశోధనల్లో మేటి..

విద్యాసాగర్ పీహెచ్‌డీ పూర్తి చేసిన తర్వాత హైదరాబాద్ ఐఐటీ, సౌత్ కొరియాలోని క్యూంగ్పుక్ నేషనల్ యూనివర్సిటీలో పోస్ట్ డాక్టోరల్ స్థానాలకు ఎంపికయ్యాడు. ప్రస్తుతం కొరియా ఎనర్జీ టెక్నాలజీ ఇనిస్టిట్యూట్ (కేఈఎన్-టెక్)లో ఆహ్వానిత శాస్త్రవేత్తగా వ్యవహరిస్తున్నాడు. ప్రస్తుతం అతని పరిశోధనలు పెరోవ్‌స్కైట్ సోలార్ సెల్స్, ఆర్టిఫిషియల్ ఫొటో సింథసిస్ ద్వారా శక్తి, పర్యావరణ సమస్యలకు స్థిరమైన పరిష్కారాలను అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టాయి. కాగా, శాస్త్రీయ ఆవిష్కరణలో డాక్టర్ విద్యాసాగర్ అంకితభావం చిన్న పట్టణాల నుంచి వచ్చే ఔత్సాహిక పరిశోధకులకు ఎంతగానో ప్రేరణగా నిలుస్తుంది. పట్టుదల ఉంటే తమ కలలను సాకారం చేయవచ్చని నిరూపిస్తుంది.



తల్లిదండ్రులు, గురువుల ప్రోత్సాహం వల్లే..

దేవ్‌తాడే విద్యాసాగర్



నేను సాధిస్తున్న విజయాలకు నా కుటుంబ సభ్యుల ప్రోత్సాహమే కారణం. సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో పని చేసిన తండ్రి ఘన్‌శ్యాం, ప్రస్తుతం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న గురువు సూర్యప్రకాశ్ ఎంతగానో ఎంకరేజ్ చేశారు. నా ప్రయాణంలో భార్య, స్నేహితులు ఇచ్చిన మద్దతునూ ఎప్పటికీ మరిచిపోలేను.